ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -164 పేజీలు - 8 వెల ₹03/- సోమవారం 21 సెప్టెంబర్ 2026

# ప్రతి ఇంటా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి

**ప్రకృతితో మమేకమైన అభివృద్ధికే భవిష్యత్తు**

**గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు అడుగులు పడాలి**

**అభివృద్ధి ఆగకూడదు.. పర్యావరణానికి గాయం చేయకూడదు**

**బెంగళూరులో 'ది ఎర్త్ సెంటర్' ప్రారంభంలో సీఎం చంద్రబాబు**



**బెంగళూరు, సెప్టెంబర్ 20 (రిపబ్లిక్ న్యూస్):** ప్రకృతికి ప్రాధాన్యమిస్తూ భవిష్యత్తు తరాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి సాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ప్రతి ఇల్లూ గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి కేంద్రం కావాలని, అప్పుడే సాధారణ విద్యుత్ ఉత్పత్తిపై భారం తగ్గనుందని అన్నారు. ఆదివారం బెంగళూరులోని వైట్ ఫీల్డ్‌లో సంపూర్ణ పర్యావరణానికి అనుకూలమైన విస్టా స్పేసెస్ ఎకో ఫ్రెండ్లీ విధానంలో నిర్మించిన 'ది ఎర్త్ సెంటర్' భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో కలిసి ఎర్త్ సెంటర్ భవనాన్ని ప్రారంభించారు. ప్రకృతి, సాంకేతికత, ఆధునిక పని వాతావరణాన్ని సమన్వయం చేస్తూ ది ఎర్త్ సెంటర్‌ను నిర్మించారు. సుస్థిర నిర్మాణం, ప్రకృతి అనుసంధానం, రీ సైకిల్ చేసిన పదార్థాల వినియోగం వంటి అంశాలకు ఈ భవనంలో ప్రాధాన్యం ఇచ్చారు. ఈ భవనం ప్రారంభం సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో సీఎం చంద్రబాబు మిగతా2లో...

## ఓటు హక్కు తొలగింపుపై సుప్రీంకోర్టులో కీలక గణాంకాలు

**● పశ్చిమ బెంగాల్‌లో 38.2 లక్షల అప్పీళ్లలో 22.2 లక్షలు తొలగించిన ఓటర్లవే ● విచారణ పూర్తయిన కేసుల్లో 93 శాతం ఓటర్లను తిరిగి జాబితాలో చేర్చిన ట్రిబ్యునళ్లు : కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడి**




**న్యూఢిల్లీ: సెప్టెంబర్ 20 (రిపబ్లిక్ న్యూస్):** పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) సందర్భంగా తొలగించిన ఓటర్లలో 82 శాతం మంది తమ పేర్లను తిరిగి చేర్చాలని అప్పీల్ చేసినట్టు కేంద్ర ఎన్నికల సంఘం.. సుప్రీంకోర్టుకు తెలిపింది. ఎన్నికల జాబితా నుంచి పేర్ల తొలగింపు, తిరిగి చేర్పు ప్రక్రియపై కొనసాగుతున్న న్యాయపరమైన పరిశీలనలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. ఎన్నికల సంఘం సమర్పించిన గణాంకాల ప్రకారం.. ప్రత్యేక ట్రైబ్యునళ్ల ముందు మొత్తం 38.2 లక్షల అప్పీళ్లు దాఖలయ్యాయి. వీటిలో 22.2 లక్షల అప్పీళ్లు ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించిన నిర్ణయాలకు వ్యతిరేకంగా దాఖలైనవే. సవరణ ప్రక్రియలో తొలగించి విచారణకు ఉంచిన 27 లక్షల మంది ఓటర్లతో పోలిస్తే ఇది సుమారు 82 శాతానికి సమానం. మరోవైపు, ఓటర్లను జాబితాలో చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ కనీసం 16.1 లక్షల అప్పీళ్లు దాఖలయ్యాయి. ఈ అప్పీళ్లను మిగతా2లో...

## అద్వానీ, జైశంకర్‌కు 'సర్' నోటీసులు

**ఎన్నికల కమిషనర్ సంధు, ఆర్మీ మాజీ చీఫ్ ద్వివేది, సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్‌కు కూడా**

**జాబితాలో ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ఎంపీ సిబల్ తదితర ప్రముఖులు**




## దళితుల భూమి ఒక్క అంగుళం తీసుకోం

**దళిత, గిరిజనులకు భూములు పంచిన చరిత్ర కాంగ్రెస్‌దే...**

**ఆ భూములకు సంపూర్ణ రక్షణ కల్పిస్తాం**

**విషప్రచారాన్ని నమ్మొద్దు : రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి**



**హైదరాబాద్, సెప్టెంబర్ 20 (రిపబ్లిక్ న్యూస్):** దళిత, గిరిజనుల భూములను లాక్కోవడం ప్రజా ప్రభుత్వ విధానం కాదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. దళితులకు సంబంధించిన అంగుళం భూమిని కూడా ప్రభుత్వం తీసుకోబోదని భరోసా ఇచ్చారు. దళితుల భూములకు ప్రజా ప్రభుత్వం సంపూర్ణ రక్షణ కల్పిస్తోందని తెలిపారు. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సామాజిక న్యాయం, పేదల సంక్షేమం, అణగారిన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ లక్ష్యమని పునరుద్ఘాటించారు. మిగతా2లో...

## ఫామ్‌హౌస్‌ల్లో రేవ్ పార్టీలు, డ్రగ్స్ దందాలు

- **అజీజ్‌నగర్ అసైన్డ్ భూమిలో అక్రమ నిర్మాణాలు**
- **కేటీఆర్ లీజు డ్రామాలు, బినామీ ఆస్తుల బాగోతం**
- **కాంగ్రెస్ క్షేత్రస్థాయి పర్యటనలు..రాజకీయ ఉద్రిక్తతలు**



**మెయినాబాద్, సెప్టెంబర్ 20 (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణలో గత బీఆర్ఎస్ పాలనలో బాగోతాలను ప్రజల ఫామ్‌హౌస్‌ల సంస్కృతి విపరీతంగా పెరిగిపో యిందని, అజీజ్‌నగర్‌లోని పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో అనేక అక్రమాలు, రేవ్ పార్టీలు జరిగా యని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 'ఫామ్‌హౌస్ ఫైల్స్' నడుస్తున్నా యని, రంగనాయక సాగర్ నుంచి మొదలుపెట్టి ఎర్రవెల్లి, జన్వాడ, అజీజ్ నగర్ వరకు ఉన్న ఫామ్‌హౌస్‌ల మిగతా2లో...




## ఫాంహౌస్ ఏమైనా టూరిస్ట్ కేంద్రమా?: మంత్రి బండి

## కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షస పాలన చేస్తోంది: హరీష్‌రావు



**హైదరాబాద సెప్టెంబర్ 20 (రిపబ్లిక్ న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రకృతి విపత్తు అయిన ఎల్ నినో కంటే రేవంత్ రెడ్డే రాష్ట్రానికి అత్యంత ప్రమాదకరమని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కరెంట్ కోతలు విధిస్తూ, నీళ్లు ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతోందని, రాష్ట్రంలో లేని కరవును సృష్టిస్తోందని ఆరోపించారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా మిగతా2లో...

## నేను తెలంగాణ బహుజనుల బాణాన్ని: కవిత



**హైదరాబాద్: సెప్టెంబర్ 20 (రిపబ్లిక్ న్యూస్): :** తాను వాళ్లూ వీళ్లూ వదిలిన బాణాన్ని కాదని, దశాబ్దాలుగా అధికారానికి, విద్యకు దూరంగా ఉన్న బహుజనుల బాణాన్ని అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఆదివారం కొడంగల్‌లో నిర్వహించిన 'పాంచజన్య మిగతా2లో...

## నేడు పిఠాపురానికి డిప్యూటీ సీఎం పవన్

**- 1500 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**

**- రేపు కాకినాడలో జనసేన ఎన్నికల సన్నాహక సమావేశం**



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888



# ప్రతి ఇంటా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ.. నగరాలు పూర్తిగా కాంక్రీట్‌మయంగా మారాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇదే విధానం వస్తోందన్నారు. కాంక్రీట్ జంగిల్స్ నుంచి పర్యావరణహిత నిర్మాణాల వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు అడుగులు వేయాలని సూచించారు. భావితరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, పర్యావరణాన్ని పరిరక్షిస్తూ అభివృద్ధి సాగాలని స్పష్టం చేశారు. **పర్యావరణ సమస్యలను అధిగమిద్దాం** వాతావరణ మార్పులతో కలిగే దుష్పరిణామాలు భవిష్యత్తులో ఎదురయ్యే సమస్య కాదని, ఇప్పటికే మన ముందున్న సవాల్ అని చంద్రబాబు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలన్నారు. భవన నిర్మాణాల్లో నెట్ జీరో విధానాన్ని అవలంబించాలని, సోలార్ విద్యుత్తుకు ప్రాధాన్యమివ్వాలని, నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. చెత్తను కంపోస్టుగా మార్చడంతోపాటు రీయూజ్ విధానాన్ని విస్తృతంగా అమలు చేయాలని చెప్పారు. ప్రస్తుతం ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ది ఎర్త్ సెంటర్ నిర్మాణం జరిగిందని కొనియాడారు. ఇలాంటి పర్యావరణహిత భవనాలకే భవిష్యత్తు ఉంటుందన్నారు. దశాబ్దాలుగా నగరాల అభివృద్ధి గ్రే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఆధారంగా సాగిందని... ఇకపై గ్రీన్ గ్రోత్, సర్క్యులర్ గ్రోత్, రీజనరేటివ్ గ్రోత్ విధానాలు అవసరమని సూచించారు. స్వచ్ఛమైన విద్యుత్తును ఉత్పత్తి చేసుకునేలా భవనాలను రూపొందించాలని సూచించారు. ప్రతి ఇంటి పైకప్పును ఒక పవర్ ప్లాంట్‌గా మార్చవచ్చని, ప్రతి నీటి చుక్కను తిరిగి వినియోగించుకోవచ్చని, ప్రతి వ్యర్థ ప్రవాహాన్ని ఒక వనరుగా మార్చుకోవచ్చన్నారు. నీటిని, నేలను కాపాడటం అంటే సంపదను సృష్టించడమేనన్నారు. వ్యవసాయంలో జీరో బడ్జెట్ నేచరుల్ ఫార్మింగ్ విధానాన్ని ప్రోత్సహిస్తున్నామని, ఇదే స్ఫూర్తిని పట్టణాభివృద్ధిలోనూ అవసరమని పేర్కొన్నారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ 'ది ఎర్త్ సెంటర్' ప్రాజెక్టును రూపొందించిన రఘువీర్ వీరమాచినేని, ప్రవీణ్‌కుమార్, విస్టా స్పేసెస్ బృందం, వెంకరమణన్ అసోసియేట్స్ ప్రతినిధుల్ని చంద్రబాబు అభినందించారు. **అమరావతి ల్యాండ్ పూలింగ్ అద్భుతం: డీకే ప్రశంసలు** మరావతిలో అమలుచేసిన ల్యాండ్ పూలింగ్ స్కీంపై కర్ణాటక సీఎం డీకే శివకుమార్ ప్రశంసల వర్షం కురిపించారు. ది ఎర్త్ సెంటర్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. కర్ణాటకలో వివిధ ప్రాంతాల అభివృద్ధి దిశగా కృషి చేస్తున్నామని, కొత్త నగరాలు, కొత్త ప్రాంతాల అభివృద్ధికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఈ ప్రస్థానంలో ఎదురయ్యే ఇబ్బందులకు చంద్రబాబు అమలుచేసిన ల్యాండ్ పూలింగ్ స్కీం మార్గనిర్దేశం చేసిందన్నారు. ల్యాండ్ పూలింగ్‌ను చంద్రబాబే తొలిసారి అమలుచేశారని ప్రశంసించారు. ఈ విధానాన్ని చేసేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. అభివృద్ధిలో భూములిచ్చిన వారిని భాగస్వాములను చేయడమనేది చాలా మంచి ఆలోచనగా పేర్కొన్నారు. చంద్రబాబు ముందుచూపు, నిబద్ధత కలిగిన నేత అని కొనియాడారు. హైదరాబాద్ అభివృద్ధిలో చంద్రబాబుదే కీలక భూమిక అన్నారు. మరో అందమైన అమరావతి నగరం నిర్మించే అవకాశం ఆయనకు దక్కిందన్నారు. బెంగళూరు పరిధి దాటి అభివృద్ధి చెందుతోందని, ఇక్కడ 1.4 కోట్ల మంది జనాభా ఉంటే... 1.3 కోట్ల వాహనాలు ఉన్నాయని చెప్పారు. ఇక్కడి రోడ్లను మరింత బలోపేతం చేయాల్సి ఉందన్నారు. దక్షిణ భారత్‌లో మేధస్సుకు కొదవలేదన్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో దక్షిణాది కీలకమన్నారు. సంపూర్ణ పర్యావరణానికి అనుకూలమైన భవన నిర్మాణానికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. విస్టా స్పేసెస్ జాయింట్ ఎండీ రఘువీర్ వీరమాచనేని, శ్వేత, రవికుమార్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

# దళితుల భూమి ఒక్క అంగుళం తీసుకోం

(మొదటి పేజీ తరువాయి)

పేదలు, దళితులు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ ఎన్నో చారిత్రాత్మక మైన నిర్ణయాలను తీసుకుందని గుర్తు చేశారు. భూ సంస్కరణలు, భూ పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా భూమిలేని దళితులకు భూములిచ్చి ఆ భూమిపై హక్కులు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వాలకు ఉందని తెలిపారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వ హయాంలో దళితులకు సుమారు 25 లక్షల ఎకరాల భూపంపిణీ, సుమారు రెండు లక్షల ఎకరాల పోడు భూములపై గిరిజనులకు హక్కులు కల్పించిన ఘనత కూడా కాంగ్రెస్‌దేనని తెలిపారు. **భూమిలేని పేదలకు హక్కులు కల్పించాం** భూమిలేని పేదలకు భూమి, హక్కులు లేని వారికి హక్కులు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ విధానమని స్పష్టం చేశారు. దళిత, గిరిజనుల భూ హక్కులను కాపాడుతూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని తెలిపారు. అధికారంలోకి వస్తే దళితులకు మూడెకరాల భూమి ఇస్తామంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించారని విమర్శించారు. 'దళితులకు సంబంధించిన ఒక అంగుళం భూమి కూడా ప్రభుత్వం లాక్కోదు. మీ భూమిని తీసుకునే ఆలోచన కూడా ఈ ప్రభుత్వానికి లేదు. మీ భూముల విషయంలో మీరు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదు. ప్రజా ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది' మంత్రి భరోసా ఇచ్చారు. భూములకు సంబంధించిన రికార్డుల పరిశీలన, సర్వేలు, భూ సమస్యల పరిష్కారం వంటి ప్రక్రియలను ప్రజల భూములను లాక్కోవడానికి చేస్తున్న చర్యలుగా చూడటం సరికాదని స్పష్టం చేశారు. భూములపై ప్రజలకు ఉన్న హక్కులను స్పష్టంగా నమోదు చేయడం, భూ వివాదాలను పరిష్కరించడం, భూ హక్కులకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు.భూముల రీ-సర్వే ద్వారా భూముల వాస్తవ పరిస్థితులను గుర్తించి దళితులకు, గిరిజనులకు హక్కులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా నూతనకల్, మద్దిరాల ప్రాంతంలోని 15 రెవెన్యూ గ్రామాల్లో, మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామంలో దశాబ్దాల భూ సమస్యలకు పరిష్కారం చూపించామని వివరించారు. భూమిపై హక్కులు కల్పించడం ద్వారా వారికి ప్రభుత్వ పథకాలు, ఇతర ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దళితుల భూముల విషయంలో కొంతమంది దొరలు కావాలనే భయాందోళనలు సృష్టిస్తూ... విషప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం దళితులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి ప్రచారాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

# ఫామ్‌హౌస్‌ల్లో రేవ్ పార్టీలు, డ్రగ్స్ దందాలు

(మొదటి పేజీ తరువాయి)

ముందుంచు తున్నామని తెలిపారు. ఆదివారం కాంగ్రెస్ నేతలు రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లో పర్యటించి, ఫామ్‌హౌస్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అజీజ్‌నగర్‌లోని ఆ ఫామ్‌హౌస్ అసైన్డ్ భూమి అని, 111 జీఓ పరిధిలో ఉన్న ఆ భూమిలో ఫామ్‌హౌస్ కట్టుకునే అధికారం రోహిత్ రెడ్డికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. కేటీఆర్ తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకరోజు ఆగర్భ శ్రీమంతులం అంటారని, మరొక రోజు తమకు హైదరాబాద్‌లో ఇల్లు కూడా లేదని డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. కేటీఆర్.. సత్యం రామలింగరాజు కంపెనీ భూముల్లో ఫామ్‌హౌస్ కట్టుకున్నారని, నార్సింగిలో ఉంటున్నానని చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. కేటీఆర్ బామ్మర్ది రాజ్ పాకాల ఫామ్‌హౌస్‌లో ఈగల్ ఫోర్స్ దాడులు చేసి ఏం జరిగిందో అందరికీ తెలుసని, అమెరికాలో చదువుకుని వచ్చి కేటీఆర్ తెలంగాణలో నేర్పిన సంప్రదాయం ఇదేనా అని ప్రశ్నించారు.ఈ ఏడాది మార్చిలో పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌లో పోలీసులు జరిపిన తనిఖీల్లో డ్రగ్స్ వ్యవహారం బట్టబయలైందని తెలిపారు. అక్కడ పోలీసులు తనిఖీలు నిర్వహించిన సమయంలో డ్రగ్స్ తాగినట్టు తేలిందని, పైలట్ రోహిత్ రెడ్డి తమ్ముడు రితేష్ రెడ్డి అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాకు చెందిన కేదార్ అనే వ్యక్తికి రూ.25 లక్షలు చెల్లించారని ఆరోపించారు. ఆ తర్వాత ఆ కేదార్ 2025లో దుబాయ్‌లో డ్రగ్ ఓవర్ డోస్‌తో మరణించాడని తెలిపారు. నార్త్ ఇండియాకు చెందిన ఆ వ్యక్తులతో వారికి ఉన్న సంబంధం ఏంటని ప్రశ్నించారు. ఫామ్‌హౌస్‌లను డ్రగ్స్, రేవ్ పార్టీలకు అడ్డాలుగా మార్చుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ తన ఫామ్‌హౌస్‌ను ప్రదీప్ రెడ్డి పేరు మీద రాయించి, ఆ భూములను తన భార్య, అత్త కుటుంబ సభ్యుల పేర్ల మీద మార్చుకున్నారని ఆరోపించారు. ఫామ్‌హౌస్ దందాల అసలు బాగోతం తెలంగాణ ప్రజలకు తెలియాలనే తాము క్షేత్రస్థాయి పర్యటనలకు వచ్చామని స్పష్టం చేశారు. ప్రజాధనాన్ని దోచుకుని ఫామ్‌హౌస్‌ల పేరుతో ఇష్టానుసారంగా వ్యవహరించిన బీఆర్ఎస్ నాయకుల అసలు బండారం త్వరలోనే ప్రజల ముందు పూర్తిగా బయటపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు ఉన్నారు. **మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఫామ్‌హౌస్ వద్ద పోలీసుల బందోబస్తు** షాబాద్ మండలం మద్దూర్ గ్రామ శివారులోని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఫామ్‌హౌస్ వద్ద పోలీసులు ఆదివారం భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు అక్కడికి వస్తారన్న సమాచారంతో ఇన్‌స్పెక్టర్ లక్ష్మి ఆధ్వర్యంలో పోలీసులు ఫామ్‌హౌస్ వద్ద భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలీసులు అక్కడే విధులు నిర్వహించారు. అయితే ఈ సమయంలో కాంగ్రెస్ నేతలు ఎవరూ అక్కడికి రాకపోవడంతో పోలీసులు తిరిగి షాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు.

# ఫాంహౌస్ ఏమైనా టూరిస్ట్ కేంద్రమా?: మంత్రి బండి

**హైదరాబాద్: సెప్టెంబర్ 20 (రిపబ్లిక్ న్యూస్): :** కాంగ్రెస్ నేతలు కెసిఆర్ ఫాంహౌస్ భూముల సందర్శనకు వెళ్లడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఖండించారు. "ఫాంహౌస్ ఏమైనా టూరిస్ట్ కేంద్రమా?.. అధికార పార్టీ నేతలు అక్కడికి వెళ్లడమేంది?.. ప్రైవేట్ వ్యక్తుల భూముల్లోకి వెళ్లే అధికారం కాంగ్రెస్ నేతలకు ఎవరిచ్చారు?.. పాంహౌస్‌లో సర్కార్ భూములుంటే తక్షణమే వాటిని స్వాధీనం చేసుకునే హక్కు ప్రభుత్వానికి ఉంది.. ఆ విషయాన్ని వదిలేసి ఈ రాజకీయ డ్రామాలేంది?" అని మండి పడ్డారు. కెసిఆర్ కుటుంబం, బిఆర్ఎస్ నేతలు రూ.లక్ష కోట్ల భూదోపిడీ చేసినట్లు ఆధారాలుంటే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికకు భయపడి కాంగ్రెస్ పార్టీ అనర్హత కేసులో స్టే కోసం సుప్రీంకోర్టుకు వెళ్లిందని ఎద్దేవా చేశారు. ఉప ఎన్నికలొస్తే కాంగ్రెస్‌ను రాజకీయ ఆదివారం మధ్యాహ్నం కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్‌రావు, స్థానిక కార్పొరేటర్లతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి ట్రైసైకిల్స్, ఫాగ్ మిషన్స్ అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కరీంనగర్‌లో చెత్త సేకరణ కోసం ప్రతి డివిజన్‌కు ఒక ట్రై సైకిల్‌ను మున్సిపల్ సిబ్బందికి అందజేస్తున్నామన్నారు. కొనుగోలు చేసిన ఫాగ్ మిషన్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నా మన్నారు. రూ.17 కోట్లతో బయోమైనింగ్ పనులకు టెండర్లు మొదలు కాబోతున్నాయన్నారు. రూ.80 యూసీఎఫ్ నిధులతో సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ పనులు చేపట్టబోతున్నామన్నారు. 16 కోట్లతో ఫ్రెష్ వేస్ట్ మేనేజ్ మెంట్ పనులను ప్రారంభించబో తున్నామన్నారు.కాంగ్రెస్ నేతల ఫాంహౌజ్ సందర్శన పెద్ద జోక్ అని అన్నారు. ప్రైవేట్ భూములను సందర్శించడానికి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులకు అధికారం ఎక్కడిదన్నారు. ఫాంహౌస్‌లో ప్రభుత్వ భూములుంటే అధికారులను పంపి స్వాధీనం చేసుకోవాలని, వాటికి సంబంధించిన ఆధారాలను సిఎం బయటపెట్టాలన్నారు.22ఏ జాబితాతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత బిఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పాలకులు 22ఏను తమకు అనుకూలంగా వాడుకున్నారన్నారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం లేక కాంగ్రెస్ సుప్రీంకోర్టుకు వెళ్లిందన్నారు. ఉప ఎన్నికలో పోటీ బిజెపి, బిఆర్ఎస్ మధ్యనే ఉంటుందన్నారు. కాంగ్రెస్‌ను జనం అసహ్యించుకుంటున్నారన్నారు. దానం నాగేందర్ తనను తాను ఖైరతాబాద్ వినాయకుడితో పోల్చుకోవడం ఆశ్చర్యమన్నారు. వినాయుడిని చివర్లో నిమజ్జనం చేస్తారనే విషయాన్ని దానం నాగేందర్ గుర్తుంచుకొని జాగ్రత్త పడితే మంచిదన్నారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌ను రాజకీయ నిమజ్జనం చేయడం తథ్యమన్నారు.

# ఓటు హక్కు తొలగింపుపై సుప్రీంకోర్టులో కీలక గణాంకాలు

(మొదటి పేజీ తరువాయి)

ఎవరు దాఖలు చేశారనే విషయాన్ని ఎన్నికల సంఘం స్పష్టంగా వెల్లడించలేదు. **విచారణ పూర్తయిన కేసుల్లో 93 శాతం చేర్పులు**మొత్తం 38.2 లక్షల అప్పీళ్లలో సుమారు 1.2 లక్షల కేసులను మాత్రమే అప్పటికి ట్రైబ్యునళ్లు పరిష్కరించాయి. అంటే మొత్తం అప్పీళ్లలో 3.1 శాతం కేసులపై మాత్రమే నిర్ణయం వెలువడింది. ఏప్రిల్‌లో ట్రైబ్యునళ్లు అప్పీళ్ల విచారణ ప్రారంభించాయి. కోర్టుకు సమర్పించిన అనుబంధ గణాంకాల ప్రకారం.. విచారణ పూర్తయిన అప్పీళ్లలో 93 శాతం కేసుల్లో ఓటర్లను తిరిగి ఎన్నికల జాబితాలో చేర్చారు. **లక్షలాది ఓటర్లపై సవరణ ప్రభావం** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టారు. ఫిబ్రవరిలో విడుదలైన తుది జాబితాలో తొలుత 61 లక్షలకుపైగా ఓటర్ల పేర్లు చేర్చబడలేదు. అనంతరం అనుబంధ జాబితాలు, విచారణ ప్రక్రియ ద్వారా సుమారు 60 లక్షల అనుమానాస్పద, పెండింగ్ కేసులను పరిశీలించే ప్రక్రియ కొనసాగింది. ఏప్రిల్ 6 నాటికి సుమారు 91 లక్షల మంది ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించబడ్డాయని నివేదికలు పేర్కొన్నాయి. ఇది సవరణ ప్రారంభానికి ముందు ఉన్న పశ్చిమ బెంగాల్ మొత్తం ఓటర్ల సంఖ్యలో దాదాపు 11.9 శాతం. దేశవ్యాప్తంగా ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోయే అవకాశం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో తొలగింపుల ప్రభావం ఎన్నికల ఫలితాలపై పడిందా అనే అంశంపైనా పలు విశ్లేషణలు వెలువడ్డాయి.

# అద్వానీ, జైశంకర్‌కు 'సర్' నోటీసులు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20 (రిపబ్లిక్ న్యూస్):** దేశంలోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా ఎన్నికల సంఘం పలువురు పౌరులతో పాటు ప్రముఖుల పేర్లను ఎడాపెడా తొలగించడం తీవ్ర విమర్శలకు దారితీస్తున్నది. అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా చూడటం ప్రధాన లక్ష్యంగా 'సర్' నిర్వహించాల్సి ఉండగా, అది పూర్తిగా దారితప్పుతున్నట్టు కనిపిస్తున్నది. తాజాగా సాక్షాత్తూ ఎన్నికల కమిషనర్ ఎస్ఎస్ సంధు, కేంద్ర మంత్రి ఎస్ జైశంకర్, ఆయన భార్య క్యోకో జైశంకర్, బీజేపీ సీనియర్ నేత, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీకి 'సర్' నోటీసులు జారీ అయ్యాయి.వీరు కాక, ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, అతని కుటుంబ సభ్యులు, సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్, అతని కుటుంబం, ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, అతని భార్య, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి రంజన దేశాయ్, కుటుంబ సభ్యులు, ఎంపీ కపిల్ సిబల్, కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ మను సింఘ్వీ, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ కూడా ఈ జాబితాలో ఉన్నారు. వీరు కాక ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్, అతని కుటుంబ సభ్యులు, అద్వానీ కుమార్తె ప్రతిభా అద్వానీకి కూడా ఈసీ ఇప్పటికే నోటీసులు అందజేసింది. ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ప్రకాశ్ రాజ్, ఎంపీ రాఘవ్ చద్దా, న్యూఢిల్లీ ఎంపీ బాన్సురి స్వరాజ్, బీజేపీ ఢిల్లీ మాజీ అధ్యక్షుడు వీరేంద్ర కుమార్ సచ్‌దేవా తదితరులకు నోటీసులు జారీ అవ్వడం వివాదాస్పదమైంది.

# నేడు పిఠాపురానికి డిప్యూటీ సీఎం పవన్

**పిఠాపురం, సెప్టెంబర్ 20 (రిపబ్లిక్ న్యూస్):** కేరళంలో చికిత్స అనంతరం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గానికి రానున్నారు. సోమ, మంగళవారాల్లో ఈ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించడంతో పాటు రూ.1500 కోట్లు విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. మంగళవారం పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానం ఆవరణలో నిర్వహించే బహిరంగ సభలో పవన్ ప్రసంగిస్తారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షస పాలన చేస్తోంది: హరీష్‌రావు

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హరీశ్ రావు మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న సర్వేలన్నీ కేసీఆర్‌కు అనుకూలంగా ఉన్నాయని, అందుకే కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు పెరిగాయని అన్నారు. కాంగ్రెస్ రైతు ప్రభుత్వమని చెప్పుకుంటూనే రాక్షస పాలన సాగిస్తోందని విమర్శించారు.

# నేను తెలంగాణ బహుజనుల బాణాన్ని: కవిత

(మొదటి పేజీ తరువాయి)

సంకల్ప సభ'లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.."నన్ను కాంగ్రెస్ వదిలిన బాణమని బీఆర్ఎస్ వాళ్లు, కేసీఆర్ వదిలిన బాణమని రేవంత్‌రెడ్డి అంటున్నారు. మరికొందరు తలకాయ లేనివాళ్లు బీజేపీ బాణమని మాట్లాడుతున్నారు. కొడంగల్ గడ్డపై నుంచి నేను ఒక్కటే చెబుతున్నా. నేను తెలంగాణ బహుజనుల బాణాన్ని. యువజనుల యుద్ధ నినాదాన్ని. అంబేడ్కర్ వాదాన్ని, మహాత్మ జ్యోతిబా ఫులే ఆత్మగౌరవ నినాదాన్ని నేను" అని కవిత ఉద్ఘాటించారు.ఒక మహిళ ఎవరి మద్దతు లేకుండా రాజకీయంగా నిలబడగలదని నిరూపించేందుకే కోడంగల్ వచ్చానని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గట్టు, కేటీ దొడ్డి మండలాల్లో అక్షరాస్యత రేటు అఫ్గానిస్తాన్‌తో సమానంగా ఉందని, రాష్ట్రంలో విద్యా బలోపేతానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏం చేశారని నిలదీశారు. 29 రాష్ట్రాలున్న దేశంలో కేవలం ఒక్క రాష్ట్రానికి మాత్రమే మహిళ ముఖ్యమంత్రిగా ఉన్నారని గుర్తుచేశారు. బహుజనులు, మహిళలు, యువత రాజకీయంగా ఎదిగేందుకు తన పోరాటం కొనసాగుతుందని కవిత తెలిపారు.

# తెలంగాణలో 13 రోజుల పాటు విద్యార్థులకు సెలవులు..

**హైదరాబాద్ సెప్టెంబర్ 20 (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణలో విద్యార్థులకు దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా అక్టోబర్ 10 నుంచి అక్టోబర్ 22 వరకు 13 రోజుల పాటు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. అక్టోబర్ 23న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి. ఈ సెలవులు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు వర్తిస్తాయి. సెలవులకు ముందు అక్టోబర్ 1 నుంచి 9 వరకు విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహించనున్నారు.

# ఈ నెల 22 నుంచి రైతు రిజిస్ట్రేషన్..

**హైదరాబాద్ సెప్టెంబర్ 20 (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్రంలో రైతు రిజిస్ట్రేషన్ (ఫార్మర్ ఐడీ) ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించ నున్నారు. రైతులు తమ గ్రామాల్లో ఏర్పాటు చేసే శిబిరాలకు హాజరై రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని వ్యవసాయ శాఖ సూచించింది.



అగ్రిస్టాక్ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న రైతు రిజిస్ట్రేషన్ ద్వారా రైతులకు పలు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపింది. విత్తనాలు, పత్తి, మొక్కజొన్న తదితర పంటల కొనుగోళ్లకు, ఎరువుల విక్రయాల కోసం, బ్యాంకుల ద్వారా రుణాల పొందేందుకు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, సేవలు పొందేందుకురైతు ఐడీ ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొన్నారు. రైతు రిజిస్ట్రేషన్ కోసం రైతులు తమ ఆధార్ కార్డు, భూమి పాస్‌బుక్, భూమి వివరాలు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్ వంటి వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. రైతులు తమకు కేటాయించిన వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఇఓ) వద్ద లేదా సంబంధిత సేవా కేంద్రంలో వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 22 నుంచి - 30 వరకు గ్రామాల్లో నిర్వహించే శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకుని ఫార్మర్ ఐడీ నమోదు పూర్తి చేసుకోవాలని వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేసింది.

# రాష్ట్రము లో కొండెక్కిన ఉల్లిగడ్డ

## నేను ఇప్పుడే కొండ దిగనంటుంది!! - "కన్నీరు తెప్పించుతున్న ఉల్లిగడ్డ"

**రాయికల్ మండలం సెప్టెంబర్,20( రిపబ్లిక్ న్యూస్)**

రాష్ట్రంలో ఉల్లిపాయ ధరలు కొండేక్కి ఇపుడిపుడే కోండ నుంచి క్రిందకు రాను అంటోంది మార్కెట్లో మంచి రకం ఉల్లిపాయలు అదిక ధర లతో కొనుగోలు చేసిన నాసిరకం ఉల్లిపాయలు ఏ మాత్రం ఘాటుగా లేకుండా చప్పగా ఉంటుందని ప్రజలు అశీటున్నారు.

ఉల్లిపాయలు బాగుండకపోయిన అవ్వి సన్న బియ్యం ధరల కు సమానంగా పోటీ పడి ఉల్లిపాయల ధరలు ఏకంగా ఒకే సారి పెరగడంతో జనం ఉల్లిపాయ వాడకం కాస్త తగ్గించేశారు దీంతో ఉల్లిపాయ అమ్మకాలు గణనీయంగా తగ్గింది. దాదాపు నాల్గవ వంతు అమ్మకాలు మాత్రమే జరుగుతున్నాయి. ఢిల్లీలో కిలో ఉల్లి ధర వంద ఇరువై రూపాయల వరకు ధర పలుకుతోంది. అదే సమయంలో ఈ ఉల్లిపాయలు కిలో విజయవాడ నగరములో వంద రూపాయలకు దొరుకుతుంది. అదే సమయంలో ఈ ఉల్లి మన హెఎదరాబాద్ యందు మార్కెట్లో ఒక కిలో ఎనుబది రూపాయల చొప్పున అమ్ముతున్నారు. మన జగిత్యాల జిల్లాలో మాత్రం ఉల్లిపాయలు 150. నూట యాబది రూపాయల వరకుకిలోనర చొప్పున ఇస్తున్నారు. ఈ సమయంలో ఎర్ర ఉల్లిపాయలు కాస్త ధరలు తక్కువని జనంఎర్ర ఉల్లిపాయలు మార్కెట్ లో ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. రైతు బజారు యందు నాసిరకం ఉల్లిపాయలు చాలా తక్కువ ధరకే అనగా కిలో యాబది వరకు లభిస్తోంది. గత సంవత్సరం ఇదే కాలంలో కేవలం



పదిహేను నుంచి ఇరవెఒ వరకు మాత్రమే విక్రయాలు జరిపారు. ఈ ఏడాది మాత్రం గత మూడు నెలలు క్రితం వంద రూపాయలకు ఐదు నుంచి ఆరు కిలోల వరకు ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి...

**"భారీగా తగ్గిన ఉల్లి దిగుమతి"**

గత నెల రోజుల వరకు హైదరాబాద్ నిజామాబాద్ మార్కెట్ కు అహ్మద్ నగరం.నాసిక్. షోలాపూర్. మరియు కర్నూలు నుంచి ఉల్లిపాయలు ఎక్కువగా దిగుమతి అయ్యిందని గతంలో ప్రతి రోజూ కొన్ని వందల లారీల ద్వారా సరుకులు సక్రమంగా ఇక్కడకు సరఫరా చేసే విధంగా ఏర్పాట్లు చేసుకోని ఇక్కడ దిగుమతి చేసుకునే వారు. ప్రస్తుతం ఉల్లి అనుకూలంగా సరకు రవాణా కాక అక్కడ ఉల్లి పంట నష్టం వాటిల్లి కేవలం అహమ్మద్ నగరంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ఉల్లిపాయ పంట ఉండగా అక్కడి నుంచి ఉల్లి ఉత్పత్తి లో ఆలస్యం అవడం ద్వారా మంచి రకాల ఉల్లి రావడం లేదని తెలిపారు. ఇతర రాష్ట్రాల లో వరదలు వర్షాలు కురవడంతో ఉల్లి ఉత్పత్తి పడిపోయింది అని అంటున్నారు. మరో నెల నుంచి రెండు నెలల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి..

**అందరికీ ప్రతి రోజూ ఉదయం సాయంత్రం అవసరం ఉల్లిపాయలు.**

ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ ఉదయం ఒక కర్రి సాయంత్రానికి కూడా మరో కర్రి మరోటి ఉదయం పూట అల్పాహారం నకు అవసరం అయ్యే ఉల్లిపాయలు వేసి బాగా వంట చేసి తింటారు..చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ కూడా మరియు ఇతర ఎలాంటి శుభకార్యం జరిగినా మరి ఇతర కార్యక్రమాలు జరిగిన కూడా ఉల్లిపాయలు అవసరమైన దాని చెప్పొచ్చు..ఉల్లిపాయలు లేని వంటలు అంటూ ఉండదు. అందుకే ఉల్లి ధరలు విపరీతంగా పెరిగాయని తెలిపారు.ఉల్లిపాయలు తినడం వల్ల మనుషుల కు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. గుండె ఆరోగ్యం దాని పనితీరు మెరుగ్గా ఉంచి పూర్తిగా రక్త పోటు నియంత్రణకు సహకారం అందిస్తూ జీర్ణ వ్యవస్థ సులభంగా ఉంటుందని రోగ నిరోధక శక్తి పెరిగి ఇన్ పేక్షన్ రాకుండా ఉండేందుకు సహాయపడే అవకాశం ఉంది..ఉల్లిపాయల ను ఆహారముతో చేర్చుకోవడా వలన చక్కెర స్థాయి అదుపులోకి తెస్తుంది. ప్రముఖ మూగ ఉల్లిపాయ రక్తం ను సహజంగా శుద్ధి చేయడం లో ప్రముఖ పాత్ర పోషిస్తున్నది

## మృతి చెందిన షేక్.జమీలాబీ కుటుంబానికి 5వేలు ఆర్థిక సహాయం అందించిన వేంపెంట మాజీ సర్పంచ్ టేకూరి రామసుబ్బమ్మ



**పాములపాడు సెప్టెంబర్ 20 రిపబ్లిక్ న్యూస్:**-పాములపాడు మండలంలోని, వేంపెంట గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన షేక్.జమిలాబి (70)పార్థివ దేహానికి మాజీ సర్పంచ్ టేకూరి రామసుబ్బమ్మ పూల మాల వేసి, నివాళులు అర్పించి ఆమె కుటుంబానికి 5000/- రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ధైర్యంగా ఉండాలని ఆ కుటుంబానికి టేకూరి రామసుబ్బమ్మ భరోసా ఇచ్చారు. ఈ విషయం తెలుసుకొని సింగపూర్ దేశం నుండి డాక్టర్ టేకూరి.నాగేశ్వరావు ఆమె కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని, సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బోనపల్లె సత్యరాజు, మాజీ ఎంపీటీసీ శివకుమార్, ముద్దపాటి ప్రసాద్, రత్నాకర్, జీవన్న, బోనాల భాస్కర్, సుబ్బారావు, దార కిరణ్, సుబ్బారాయుడు, తదితరులు పాల్గొన్నారు

## పాణ్యం హైవే అండర్‌పాస్ వద్ద వేలాడుతున్న విద్యుత్ లైన్.

### ప్రమాదం పొంచి ఉందంటున్న ప్రయాణికులు

### వెంటనే మరమత్తులకు చర్యలు తీసుకోవాలని ప్రజలు



**పాణ్యం ప్రతినిధి సెప్టెంబర్ 20, (ప్రజా రిపబ్లిక్ న్యూస్).**పాణ్యం హైవే అండర్‌పాస్ బ్రిడ్జి కింద హైవేకు సంబంధించిన విద్యుత్ లైన్ వేలాడుతూ ఉండటంతో ప్రయాణికులు, స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ లైన్ తక్కువ ఎత్తులో వేలాడుతుండటంతో వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదం జరిగే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.ముఖ్యంగా భారీ వాహనాలు, లారీలు వెళ్లే సమయంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని తెలిపారు.ప్రమాదం జరిగే వరకు వేచి చూడకుండా హైవే అధికారులు వెంటనే స్పందించి వేలాడుతున్న విద్యుత్ లైన్‌ను సరిచేసి, ప్రయాణికుల భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

## మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన టెలికాం అడ్వైజర్ కమిటీ మెంబర్ కురువ రమేష్

### రాయలసీమ హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్న బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

**పాములపాడు సెప్టెంబర్ 20 రిపబ్లిక్ న్యూస్:-**

రాయలసీమ అభివృద్ధి, ప్రజల హక్కుల కోసం అహర్నిశలు కృషి చేస్తూ, రాయలసీమ ప్రజల సంక్షేమం కోసం తన గళాన్ని నిరంతరం వినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే, రాయలసీమ ఉద్యమకారుడు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు వెల్లువెత్తాయి.ఈ సందర్భంగా జిల్లా టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు & తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు కురువ రమేష్, శ్రీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ షాప్ యజమాని కురువ నాగరాజుతో కలిసి రాయలసీమ పులి & మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆత్మీయంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేసి, హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా టెలికం అడ్వైజర్ కమిటీ మెంబర్ & టిడిపి యువ నాయకుడు కురువ రమేష్



మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి రాయలసీమ ప్రాంతం అభివృద్ధి చెందాలని, ఈ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఎన్నో ఏళ్లుగా ప్రజా సమస్యలపై తన స్వరాన్ని వినిపిస్తున్నారని పేర్కొన్నారు.రాయలసీమ అభివృద్ధి కోసం ఆయన చేస్తున్న కృషి, ప్రజా సమస్యలపై ఆయన చూపుతున్న చొరవ



స్ఫూర్తిదాయకమని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి కి సంపూర్ణ ఆయురారోగ్యాలు కలగాలని, భవిష్యత్తులోనూ ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని టెలికాం అడ్వైజరీ కమిటీ మెంబర్ & టిడిపి యువ నాయకుడు కురువ రమేష్, కురువ నాగరాజు ఆకాంక్షించారు.ఈ జన్మదిన వేడుక సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో అభిమానులు, శ్రేయోభిలాషులు కూడా ఉన్నారు.

## కష్టపడే వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటా

### - మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి



**మహానంది, సెప్టెంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్)**



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని శ్రీశైలం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. మహానందిలోని కుమ్మరి శాలివాహన సత్రంలో ఆదివారం సాయంత్రం మహానంది మండల పార్టీ అధ్యక్షుడు కొమ్మా పాల మహేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ చలో వెలుగోడు పేరుతో రైతులతో కలిసి కార్యక్రమం నిర్వహించే వరకు నీళ్లు ఇచ్చే విషయం అధికార పార్టీకి గుర్తుకు రాలేదని మండిపడ్డారు. వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా పోటీ చేయాలని, కష్టపడే వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన గుర్తింపు కార్డు లను మహానంది మండల నాయకులు, వివిధ విభాగాల వారికి అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర రెడ్డి, జడ్పీటీసీ కెవిఆర్ మహేశ్వరరెడ్డి, సీనియర్ నాయకులు కొండా మధుసూదన్ రెడ్డి, బీసీ సంఘం నాయకుడు గజ్జల పెద్ద పక్కీరయ్య, రైతు విభాగం నాయకులు సాగేశ్వర రెడ్డి, మాజీ సర్పంచ్ లు జయసింహా రెడ్డి, బంగి వెంకటేశ్వర్లు, మండల నాయకులు పాల్గొన్నారు.

## మాల ఉలిగమ్మ కుటుంబానికి టీడీపీ ఆర్థిక సహాయం

### భౌతికకాయానికి నివాళులర్పించిన పట్టణ టీడీపీ కోశాధికారి విజయలక్ష్మి

**ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 20 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):**

ఎమ్మిగనూరు పట్టణంలోని 30వ వార్డుకు చెందిన మాల ఉలిగమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె భౌతికకాయానికి ఎమ్మిగనూరు పట్టణ టీడీపీ కోశాధికారి శ్రీమతి సి. విజయలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని ప్రతి కుటుంబాన్ని తన సొంత కుటుంబంగా భావిస్తూ, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలన్న ఎమ్మెల్యే డా. బి.వి. జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు మాల ఉలిగమ్మ కుటుంబానికి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందించినట్లు విజయలక్ష్మి తెలిపారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గ



ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా అండగా నిలవడమే ఎమ్మెల్యే డా. బి.వి. జయనాగేశ్వర రెడ్డి లక్ష్యమన్నారు. బాధిత కుటుంబాలకు ఆపద సమయంలో భరోసా కల్పించేందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. మాల ఉలిగమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని



విజయలక్ష్మి ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భీమన్న, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నాగార్జున మృత దేహానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ భార్గవ్ రామ్ దంపతులు.



**ఆళ్లగడ్డ సెప్టెంబర్ 20 రిపబ్లిక్ న్యూస్**

నిన్నటి రోజు ఉయ్యాలవాడ గ్రామం దగ్గర హత్య గావించ బడ్డ ఆళ్లగడ్డ మండలం చింతకుంట్ల గ్రామానికి చెందిన మిద్దె నాగార్జున నిన్నటి రోజున హత్యకు గురి కావడం జరిగింది. నాగార్జున స్వగ్రామం భీమవరం గ్రామానికి వెళ్లి నాగార్జున మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ భార్గవ్ రామ్ దంపతులు.అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ హత్య చేసిన నిందితులకు కచ్చితంగా శిక్ష పడేలాగా చూస్తామని, పిల్లల చదువు బాధ్యతలు, దగ్గర ఉండి మేమే చూసుకుంటామని భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ భార్గవ్ రామ్ దంపతులు.



## మహానందీశ్వరుడి సన్నిధిలో

**మహానంది, సెప్టెంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్)**



మహానందీశ్వరుని సేవలో ఆంధ్రప్రదేశ్ ఎలక్షన్ కమిషన్ మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్, కుటుంబ సభ్యులు ఆదివారం పూజలు నిర్వహించారు. దర్శనానికి వచ్చిన వారికి ఆలయ ఈవో నల్లకాలువ శ్రీనివాసరెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు శ్రీ కామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం కుంకుమార్చన పూజలు చేపట్టారు అనంతరం వారికి స్థానిక కళ్యాణ మండపంలో స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. శ్రీ మహానందీశ్వర స్వామి వారి చిత్రపటం అందించి సన్మానించారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888



# కాంగ్రెస్‌లో రామచిలక యువరాజ్ చేరిక

## క్రాంతికుమార్ నాయుడు ఆధ్వర్యంలో పార్టీలో చేరిక. -. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వెల్లడి

**మంత్రాలయం, సెప్టెంబర్ 20 (ప్రజారిపబ్లిక్ న్యూస్ ):** మంత్రాలయం మండలంలో కాంగ్రెస్ పార్టీకి మరో చేరిక చోటుచేసుకుంది. కర్నూలు జిల్లా డీసీసీ అధ్యక్షుడు క్రాంతికుమార్ నాయుడు ఆధ్వర్యంలో మండలానికి చెందిన రామచిలకల యువరాజ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్సీ పి.వి. మోహన్ సమక్షంలో ఆయన కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని పార్టీలో చేరగా, నాయకులు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు.కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, విధానాలకు ఆకర్షితుడై ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీతో కలిసి పనిచేసేందుకు యువరాజ్ ముందుకు వచ్చినట్లు నాయకులు తెలిపారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో పాటు, ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.మంత్రాలయం మండలంలో కాంగ్రెస్



పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. గ్రామస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ప్రజలతో నిరంతరం మమేకం కావాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు.

యువరాజ్ చేరికతో మంత్రాలయం మండలంలో కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలకు మరింత ఊతం లభిస్తుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్తగా పార్టీలో చేరుతున్న వారిని కలుపుకొని పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు స్థానిక సమస్యలపై నిరంతరం స్పందించాలని సూచించారు.

ఈ సందర్భంగా యువరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో పనిచేస్తూ మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని నూతనంగా పార్టీలో చేరిన యువరాజ్‌కు అభినందనలు తెలిపారు.

# రుద్రవరం షేక్.ముర్తుజావలి కుమార్తె, పాములపాడు షేక్.మొహమ్మద్ హనీప్ కుమారుడి వివాహ వేడుకలో ప్రముఖులు





**పాములపాడు సెప్టెంబర్ 20 రిపబ్లిక్ న్యూస్:-** పాములపాడు మండలంలోని, రుద్రవరం గ్రామ షేక్.ముర్తుజావలి కుమార్తె, షేక్.మొహమ్మద్ హనీఫ్ కుమారుడు షేక్.అబ్దుల్ రజాక్ ల వివాహ వేడుకలో తెలుగు యువత మండల అధ్యక్షుడు షేక్.కరీం భాషా, మండల కో ఆప్షన్ నెంబర్ సయ్యద్.ముర్తుజాఅలి, వైఎస్ఆర్సిపి ఆర్టిఐ మండల అధ్యక్షుడు శెట్టి శివలింగం, మాలిక్, హుస్సేన్ బాషా, టిడిపి నాయకులు ముడియాల.సుబ్బారెడ్డి, ప్రింట్ మీడియా ప్రతినిధులు షేక్.మొహమ్మద్ రఫీ, ఎస్.షర్ఫుద్దీన్ అలి, భావన వినోద్ కుమార్, తదితర ప్రముఖులు పాల్గొని, నూతన వధూవరులకు షాదీ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేసి, ఆశీర్వదించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో బషీర్ అహ్మద్ హఫీసాబ్, నబి రసూల్, మాసూం వలి, షేక్.దస్తగిరి, షేక్.అల్లాబకాష్, షేక్.రహంతుల్లా, షేక్.ఇస్మాయిల్, మా భాష, ఉస్మాన్, హిదాయతుల్లా, అహ్మద్ హుస్సేన్, మహబూబ్ బాషా, కుటుంబ సభ్యులు షేక్. మెహరున్ బి, ముజాహిద్, సమీర్, సుహానా, దస్తగిరి మాసూం వలి, మూర్తుజావలి, పాండురంగారెడ్డి, తదితర బంధుమిత్రులు పాల్గొనడం జరిగింది.

# అనారోగ్యంతో చనిపోయిన వడ్డే వెంకటమ్మకు అంతిమ సంస్కారాలు జరిపిన డాక్టర్ ఈపనగండ్ల శ్రీనివాస్ యాదవ్

**ఆళ్లగడ్డ సెప్టెంబర్ 20 రిపబ్లిక్ న్యూస్**

అందరూ వున్న ఆర్థిక ఇబ్బందులతో అనారోగ్యం తో చనిపోయిన వడ్డె వెంకటమ్మ కు

సమాజ సేవకులు, అనాధ రక్షకుడు,జిల్లా జంతు సంరక్షణ అధ్యక్షులు డాక్టర్ విపనగశీడ్ల శ్రీనివాస యాదవ్ అంతిమ సంస్కారాలు నిర్వహించారు. డాక్టర్ విపనగశీడ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ వడ్డే వెంకటమ్మ అనారోగ్య కారణంగా ఈరోజు పరమపదించడం జరిగినది వారికి అందరూ ఉన్నప్పటికీ అనారోగ్యంతోబాధపడుతూ పరమపదించడం జరిగినది కడు పేదరికంతో జీవించడం జరిగినది హాస్పిటల్ ఖర్చులు కూడా డబ్బులు లేక చనిపోవడం జరిగినది కావున వడ్డే వెంకటమ్మకు అంతిమ సంస్కారాలు నేను నిర్వహించాను ఈ విషయం తెలిసి పలుకూరి సురేష్ వారి ఆత్మకు శాంతి కలగాలని దేవుని ప్రార్థించడం జరిగినది ఈ యొక్క అంతిమ సంస్కారాలలో నాకు తోడుగా వైకుంఠ రథం ఓబులేసు మున్సిపల్ వర్కర్స్ శ్రీనివాసులు, మద్దిలేటిసహాయం చేశారు. ఆమెకు ఇద్దరు కుమారులు వారి బంధువులు పాల్గొనగా నేను వారికి అంతిమ సంస్కారం నిర్వహించి వారి ఆత్మకు శాంతి కలగాలని దేవుని ప్రార్థించి వీడ్కోలు యాత్ర ఏర్పాటు చేయడం జరిగినది గతవారం వీరి భర్త అనారోగ్యకారంతో చనిపోగా ఆమె భర్తకు కూడా నేనే అంతిమ సంస్కారాలు పూర్తి చేయడం జరిగినది ప్రస్తుతం వీరికి ఇద్దరు కుమారులు 20 సంవత్సరాలు పైబడి



ఉంటారు వారు మద్యానికి బానిసై ఉన్నారు ఒకతను గతవారం గొంతు కోసుకోవడం జరిగినది ఆ గాయం అలాగే ఉంది హాస్పిటల్ లో చూపించుకోలేక ఆర్థిక ఇబ్బందులతో అలాగే ఉన్నాడు ఇంకొక అబ్బాయికి ఈరోజు హోట్ ప్రాబ్లం జనరేట్ అయింది కావున దాతలు ఎవరైనా ఉంటే ఈ ఇద్దరు అబ్బాయిలకు వైద్యఖర్చుల నిమిత్తం వారికి సాయం చేయగలరు వారు సద్దాం కాలనీలో స్టార్టింగ్ లోనే వారి పూరి గుడిసె ఉన్నది సాయం చేయవలసిన వాళ్ళు నాకు ఫోన్ చేస్తే వాళ్ళ ఇల్లు చూపిస్తాను ఈ ఇద్దరు కుమారులు 20 సంవత్సరాలు ఉంటాయి పూర్తిగా మద్యానికి బానిసై ఉన్నారు తల్లిదండ్రులు ఆలనా పాలన చూసే పరిస్థితి లో లేరు. కావున ఆ కుటుంబం కడు దుర్భరమైన జీవితాన్ని గడిపి



వెంకటమ్మ మరియు ఆమె భర్త ఒక వారం లోపల ఇద్దరు పరమపదించారు ఇది చాలా బాధాకరం కావున సహాయం చేయవలసిన వాళ్ళు నాకు ఫోన్ చేస్తే వాళ్ళ ఇల్లు చూపించగలను నా ఫోన్ నెంబర్ 9441580669.

# వినాయక పూజలో పాల్గొని భక్తులకు అన్నదానం చేసిన పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి





**కల్లూరు ప్రతినిధి, సెప్టెంబర్20 (రిపబ్లిక్ న్యూస్)** పాణ్యం నియోజకవర్గంకల్లూరు అర్బన్ పరిధిలోని 34వ వార్డు గీతానగర్ రోడ్ నెం.3లో శ్రీ వరసిద్ధి వినాయక భక్త బృందం వారి ఆహ్వానం మేరకు వినాయక మండపాన్ని సందర్శించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం కల్లూరు అర్బన్ 35వ వార్డు ముజఫర్ నగర్ ఆటో స్టాండ్ వద్ద జై బాలగణేష్ భక్త బృందం వారి ఆహ్వానం మేరకు వినాయక పూజ కార్యక్రమంలో పాల్గొని, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులకు స్వయంగా అన్నం వడ్డించి, వారితో ఆప్యాయంగా మమేకమయ్యారు.వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని కాటసాని రామభూపాల్ రెడ్డి గారు ఆకాంక్షించారు

# 4కరువు నుంచి ప్రజలను కాపాడేది ఉపాధిహామీ పథకమే

## వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. లోఖనాథం






**ఓర్వకల్ ప్రతినిధి, సెప్టెంబర్20 (రిపబ్లిక్ న్యూస్)** రాష్ట్రంలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో గ్రామీణ పేదలను, వ్యవసాయ కూలీలను ఆదుకునేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. లోఖనాథం డిమాండ్ చేశారు. ఓర్వకల్లు మండల కేంద్రంలో జిల్లా విస్తృత స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షుడు బి. వీరశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు.లోఖనాథం మాట్లాడుతూ కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి ప్రతి పేద కుటుంబానికి రూ.5 వేల పింఛన్ ఇవ్వాలని, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులు అందించాలని కోరారు. ప్రతి కుటుంబానికి 200 రోజుల ఉపాధి పనులు కల్పించి రోజుకు రూ.700 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.జిల్లా కార్యదర్శి కె.వి. నారాయణ మాట్లాడుతూ జిల్లాను కరువు మండలంగా ప్రకటించేందుకు క్షేత్రస్థాయిలో ఉద్యమిస్తామని, ఉపాధి పనులు కల్పించేలా ప్రభుత్వం, అధికారులపై ఒత్తిడి పెంచాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా నాయకులు బి. నాగన్న, కె. లింగన్న, ఈ. తిక్కన్న, బి. బాలకృష్ణ, డి. శ్రీరాములు, పి. సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# విఘ్నేశ్వరుని సన్నిధిలో టీడీపీ నేతల ప్రత్యేక పూజలు

**కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 20(రిపబ్లిక్ న్యూస్)**



కర్నూలు నగరంలోని 20వ వార్డు ధనలక్ష్మి నగర్‌లో నిర్వహించిన గణపతి పూజా కార్యక్రమానికి నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షురాలు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, పాణ్యం నియోజకవర్గ టీడీపీ యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఓర్వకల్ టీడీపీ మండల అధ్యక్షులు దుగ్గపూటి నాగిరెడ్డి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన ఏర్పాటు చేసిన అల్పాహార కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని నాయకులు ఆకాంక్షించారు.కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, మంజునాథ్ రెడ్డి, హరీష్ రెడ్డి కొణిదెల, ప్రభాకర్ యాదవ్, బాలి రెడ్డి, కిరణ్ తదితర నాయకులతో పాటు ధనలక్ష్మి నగర్ యూత్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో గణనాథుని నిమజ్జనం

## రంగులు చల్లుకుంటూ.. డీజే పాటలకు నృత్యాలతో విద్యార్థుల సందడి

**కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 20 (రిపబ్లిక్ న్యూస్):** కర్నూలు నగరంలోని యేలుకూరు బంగ్లాలో ఉన్న నారాయణ రెసిడెన్షియల్ స్కూల్ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన శ్రీ వినాయక విగ్రహానికి పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏడో రోజు గణనాథుని నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

నిమజ్జన వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ, డీజే పాటలకు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. వినాయక నామస్మరణలు, భక్తిగీతాలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు.




ఈ సందర్భంగా పాఠశాల ఏజీఎం సిరికి రమేష్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సాంస్కృతిక విలువలను పెంపొందించేలా వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించామని తెలిపారు. ఉత్సవాలను ప్రశాంతంగా, ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా నిర్వహించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు.

# 30 ఏళ్ల సేవా ప్రస్థానానికి మరింత బలోపేతం

## అఖిల భారతీయ బ్రాహ్మణ కరివేన నిత్యాన్నదాన సత్రం వార్షిక సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహణ

**కర్నూలు సెప్టెంబర్20 (రిపబ్లిక్ న్యూస్)** కర్నూలు నగరంలోని పాత బస్టాండ్ సమీపంలోని లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మండపంలో అఖిల భారతీయ బ్రాహ్మణ కరివేన నిత్యాన్నదాన సత్రం వార్షిక సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఉన్న సత్రం సభ్యులు హాజరై సత్రం అభివృద్ధి, సేవా కార్యక్రమాల విస్తరణ, భవిష్యత్ ప్రణాళికలపై చర్చించారు.

సత్రం అధ్యక్షులు కోనూరు సతీష్ శర్మ మాట్లాడుతూ, 130 ఏళ్లుగా నిత్యాన్నదానం, సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. భద్రాచలం, క్షేత్రకూట, కాశీ, తిరుపతి తదితర పుణ్యక్షేత్రాల్లో సత్రం భవనాలు, వసతుల అభివృద్ధికి బడ్జెట్ కేటాయించినట్లు చెప్పారు.

ప్రధాన కార్యదర్శి మనోహర్ రావు మాట్లాడుతూ, ఐదు దశాబ్దాలుగా వేద పాఠశాలను నిర్వహిస్తూ విద్యార్థులకు



వేద విద్యతో పాటు ఆధునిక విద్యను అందిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా 18 బ్రాంచ్‌లతో సేవలు కొనసాగుతున్నాయని, అన్నవరం తదితర ప్రాంతాల్లో నూతన బ్రాంచ్‌లు ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

కోశాధికారి కరణం చిదంబరం సత్రం ఆదాయ-వ్యయ వివరాలు, ఆర్థిక పరిస్థితి, భవిష్యత్ బడ్జెట్ ప్రణాళికలను సభ్యులకు వివరించారు. సత్రం ఆర్థికంగా పటిష్టంగా ఉందని తెలిపారు.

ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.ఆర్. శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ సత్రం సేవా కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు సభ్యుల సహకారంతో ముందుకు సాగుతామని తెలిపారు. సమావేశంలో సత్రం అభివృద్ధి, సేవా కార్యక్రమాల బలోపేతానికి పలు నిర్ణయాలు తీసుకున్నారు.

# కార్మిక వ్యతిరేక చట్టాల రద్దు కోసం,

## కనీస వేతనం 42,000 వ్వాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు. కందారపు మురళి పిలుపు







**రైల్వే కోడూరు సెప్టెంబర్ 20 రిపబ్లిక్ న్యూస్.** కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రక్షించుకోవడం కోసం, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు రద్దు కోసం, కనీస వేతనం 42,000 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారం మురళి పిలుపునిచ్చారు. సాయంత్రం రైల్వే కోడూరు ఎన్జీవో హోం లో, సిఐటియు ముఖ్య కార్యకర్తలు సమావేశం జరిగినది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ, కేంద్రంలో, బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, ఉద్యోగులు కార్మికులకు వ్యతిరేకంగా పెట్టుబడుదారులు, అమెరికా సామ్రాజ్యవాదులకు అనుకూలమైన చట్టాలు చేస్తున్నారని. లాభాల కోసం దేశ సంపదను దోచిపెడుతున్నారని ఆరోపించారు, అందరి సమస్యలు తీర్చగలిగేది, తిండి బట్ట విద్యా ఉద్యోగం, సమాన అవకాశాలు ఉండేది, దోపిడీ లేని సమాజం, సోషలిజంలోనే అన్నారు. సోషలిజం లేదు, కమ్యూనిజం లేదు, అని చెప్పే పాలకవర్గాలకు, రాజస్థాన్ ఎడారిలో, మున్సిపాలిటీలో మతోన్మాద పార్టీని ఓడించి, ఎర్రజెండా ఎగిరిందని గుర్తు చేశారు. భవిష్యత్తు సోషలిజందే అని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, ఎన్నికల వాగ్దానాలు, విస్మరించాయన్నారు. రెగ్యులర్ చేయడం గాని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయకపోవడం, అన్ని రకాల ధరలు పెరిగిన కార్మికుల కనీస వేతనాలు పెరగడం లేదని చాలా కాలం నుండి పెంచడం లేదని, ఆరోపించారు.ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలని మోసం చేశారని, జీఎస్టీ పేరుతో బారాల మోపి, పెట్రోల్ డీజిల్ గ్యాస్, నేడు యూపీఐ చార్జీల పేరుతో కార్పొరేట్లకు దోచి పెడుతున్నారు అన్నారు. ఏడాది పాటు రైతు వ్యతిరేక చట్టాలకు నిరసనగా పోరాడి సాధించారన్నారు. ఢిల్లీవిద్యార్థుల పోరాటం స్ఫూర్తిదాయకం అన్నారు. వాటి స్ఫూర్తితో, ఉద్యోగులు కార్మికులందరూ ఐక్యంగా పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, సిఐటియు రాష్ట్ర కౌన్సిల్లో నాయకులు సిహెచ్ చంద్రశేఖర్, ఏపీఎండిసీ పోరాట జేఏసీ కన్వీనర్, ఆర్ వెంకటేష్, మంగంపేట మైనింగ్ వర్కర్స్ ,యూనియన్ త్రివేణి నాయకులు, ముత్యాల శ్రీనివాసులు ,పులగంటి శ్రీనివాసులు, విజయ్, అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు, శ్రీలక్ష్మి, సిఐటియు మండల కన్వీనర్, పి జాన్ ప్రసాద్, చిట్వేల్ మండల కన్వీనర్, వై.సుజాత, పెనగలూరు మండల కన్వీనర్, బి,శిరీషా, వివో ఏ, ఆనిమేటర్స్, జిల్లా నాయకులు, నగిరిపాటి, ఆనంద్, బివి రమణ, రోజా, అమరావతి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ నాయకులు, ఎం.సుబ్బరాయుడు, అంకయ్య, బిల్డింగ్ వర్కర్స్ నాయకులు, బి.రాజశేఖర్, రవి, బద్రి, ఏపీరైతు సంఘ రాష్ట్ర నాయకులు, పంది కాళ్ళ మణి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బొంతవారిపల్లి గణేశుని నిమజ్జనం.









**రైల్వే కోడూరు సెప్టెంబర్ 20 రిపబ్లిక్ న్యూస్.**

ఓబులవారిపల్లి మండలం బొంతవారిపల్లి గ్రామంలో ని బొజ్జ గణపయ్య నిమజ్జనోత్సవ కార్యక్రమం కన్నుల పండుగగా గ్రామస్తులు, యువత, చిన్న,పెద్ద అందరూ ఐకమత్యంతో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు, ఆదివారం ఉదయం లంబోదరుడిని అత్యంత సుందరముగా అలంకరించి బొంతవారిపల్లి వీధులలో మేళ తాళాల, డప్పుల వాయిద్యాలతో, యువత చిందులు వేస్తూ ఒకరినొకరు సంతోషాలతో పసుపు, కుంకుమ, రంగుల కలయికతో ఒకరినొకరు వసంతోత్సవాలు జరుపుకుంటూ వీధుల గుండా వినాయకుని ఊరేగిస్తూ గ్రామంలోని మహిళలు గణేశు నికి నైవేద్యాలు అందిస్తూ తమ మొక్కులను చిన్న పెద్ద అమ్మలక్కలు తీర్చు కున్నారు, అంతేకాకుండా మధ్యాహ్నం విందు భోజన అన్నదాన కార్యక్రమం ఘనంగా భక్తులు నిర్వహించారు, అనంతరం పురవీధుల గుండా గణేశుని ఊరేగిస్తూ డప్పు వాయిద్యాల మధ్య యువత చిందులేస్తూ బొంతవారిపల్లె గణేశుని నిమజ్జన కార్యక్రమం విజయవంతముగా యువత నిర్వహించినది, గ్రామములో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవ కమిటీ తగు జాగ్రత్త, చర్యలు తీసుకొని వినాయక నిమజ్జనాన్ని పూర్తికావించారు.

# అమరావతి కోసం విశాఖను దెబ్బతీస్తున్నారు: గుడివాడ అమర్నాథ్

అమరావతికి పెద్దపీట వేయడం కోసమే టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విశాఖపట్నం అభివృద్ధిని ఉద్దేశపూర్వకంగా దెబ్బతీస్తోందని వైసీపీ నేత గుడివాడ అమర్నాథ్ ధ్వజమెత్తారు. స్థానిక సమస్యలను గాలికొదిలి, కేవలం ప్రతిపక్షంపై తప్పుడు ప్రచారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ధ్వజమెత్తారు.విశాఖలో మీడియాతో మాట్లాడిన అమర్నాథ్, ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని వేదికలనూ వైసీపీని, పార్టీ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకోవడానికే వాడుకుంటున్నారని విమర్శించారు. తన రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ అయిన అమరావతిని ప్రమోట్ చేసుకోవడం కోసమే చంద్రబాబు విశాఖను చిన్నచూపు చూస్తున్నారని ఆరోపించారు. “నగరంలో తీవ్రమైన తాగునీటి ఎద్దడి నెలకొన్నా, కనీస దిద్దుబాటు చర్యలు చేపట్టలేదు. ఇది విశాఖ అభివృద్ధిని నిలిపివేయాలనే ఉద్దేశపూర్వక కుట్రలో భాగమే“ అని ఆయన అన్నారు.జగన్ 1.30 లక్షల ఇళ్ల పట్టాలు ఇస్తే, కూటమి ప్రభుత్వం ఆ పనులను నిలిపివేసిందని అమర్నాథ్ గుర్తుచేశారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇళ్ల పట్టాల పంపిణీ పేరుతో డ్రామా ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. విశాఖలో అత్యంత విలువైన భూములను తమకు కావాల్సిన వారికి, ముఖ్యంగా ఎక్కడినుంచో పుట్టుకొచ్చిన రియల్ ఎస్టేట్ కంపెనీలకు చౌకగా కట్టబెట్టారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ భూదోపిడీలో మంత్రి నారా లోకేశ్ తోడల్లుడు, స్థానిక ఎంపీ కూడా భాగస్వామిగా ఉన్నారని ఆరోపించారు.జలాశయాలన్నీ ఎండిపోయి, ప్రజలు తాగునీటి కోసం ఎదురుచూస్తుంటే, సీఎం చంద్రబాబు ఆ సమస్య గురించి మాట్లాడకుండా వైసీపీపై విమర్శలు చేయడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమని వ్యంగ్యం ప్రదర్శించారు. చంద్రబాబు ఈవెంట్ మేనేజ్‌మెంట్‌తో ప్రజలు విసిగిపోయారని, ప్రధాన సమస్యలను పరిష్కరించకుండా జ్యోతిష్యాలు చెబుతూ కాలం గడుపుతున్నారని అమర్నాథ్ విమర్శించారు. పంచ ధారల జోన్‌లో అక్రమ మైనింగ్‌ను వైసీపీనే అడ్డుకుందని, భవిష్యత్తులో కూడా ప్రజల సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# మహిళపై అఘాయిత్యం

**ప్రతిఘటించిన వీర మహిళ**

**కక్షగట్టి విచక్షణారహితంగా దళిత మహిళపై దాడి**

**అడ్డు వచ్చిన తమ్ముడు పైనా గొడ్డలి పోటు**

**తీవ్రంగా గాయపడిన వ్యక్తి**

**సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స**

**దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్**

**న్యాయం చేయకపోతే పోలీస్‌స్టేషన్ ముట్టడిస్తాం**

**ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు,**

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్**



**అనంతపురం క్రైమ్, సెప్టెంబర్ 20,(రిపబ్లిక్ న్యూస్):**

దళిత సామాజిక వర్గానికి చెందిన మహిళపై అక్కులప్ప అనే వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడేందుకు వెళ్లాడని దీంతో ఆమె ప్రతిఘటించడంతో కత్తులు గొడ్డలితో విచక్షణరహితంగా దాడి చేయడంతో ఆమె కత్తిపోట్ల వల్ల తీవ్ర గాయాల పాలయిందన్నారు. అఘాయిత్యానికి ప్రతిఘటించిన దళిత మహిళపై కక్షగట్టి దాడి చేయడంతో రాప్తాడు నియోజకవర్గంలోని గిరిదిండ్ల గ్రామంలో కలకలం రేపుతున్నాయి.గత ఐదు రోజుల క్రితం ఆమెపై జరుగుతున్న దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన అనుషపై కొందరు విచక్షణారహితంగా దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఆదివారం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను వైయస్సార్సీపి ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు పెన్నోబులేసు, వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, నరసింహమూర్తి సత్యసాయి జిల్లా వైయస్సార్ సిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు,సాకే రామంజి ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆలమూరు ఓబులేసు మండలాధ్యక్షుడు, బసంపల్లి రామాంజనేయులు తదితరులు పరామర్శించారు.

**మిగిలిన వారిని ఎందుకు అరెస్టు చేయలేదు**

రాప్తాడు నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలం గొరిదిండ్ల గ్రామంలో దళిత మహిళపై జరిగిన దాడి కలకలం రేపింది. అఘాయిత్యానికి ప్రతిఘటించిందన్న కారణంతో అనూష అనే మహిళపై కత్తులతో దాడి చేశారని, ఆమెకు అండగా నిలిచేందుకు ప్రయత్నించిన తమ్ముడిపైనా గొడ్డలితో దాడి చేశారని వైయస్సార్సీపి ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు పెన్నోబులేసు మండిపడ్డారు. తీవ్రంగా గాయపడిన బాధితులు అనంతపురం సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. బాధితులను పరామర్శించిన అనంతరం పెన్నోబులేసు మాట్లాడుతూ.. అక్కులప్ప అనే వ్యక్తి అనూషపై అఘాయిత్యానికి ప్రయత్నించాడని, ఆమె ప్రతిఘటించడంతో కక్షగట్టి కత్తులతో దాడి చేయడంతో దాడిలో తీవ్రంగా గాయపడ్డారని, ఆమెకు అండగా నిలిచిన కుటుంబ సభ్యులపైనా దాడి జరిగిందని పేర్కొన్నారు. ఘటనలో అక్కులప్పతో పాటు మధు, సోమశేఖర్, రామాంజనేయులు ఉన్నారని, అయితే అక్కులప్పను మాత్రమే అరెస్టు చేసి మిగిలిన వారిని ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు.దళిత మహిళపై దాడి జరిగినా అధికార యంత్రాంగం స్పందించకపోవడం బాధాకరమని పెన్నోబులేసు అన్నారు. బాధితులపైనే తిరిగి కేసులు నమోదు చేస్తున్నారంటూ పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. గతంలో ఏడుగురాళ్లపల్లిలో బాలికపై జరిగిన అత్యాచార ఘటనను ప్రస్తావిస్తూ.. వరుస ఘటనలపై ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం కఠినంగా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు.

**ఆత్మకూరు పోలీస్‌స్టేషన్ ను ముట్టడిస్తాం**

వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్ మాట్లాడుతూ అనూషతో పాటు ఆమె అన్నదమ్ములపై దాడి చేయడం అమానుషమన్నారు. బాధితురాలు ఆసుపత్రి బెడ్‌పై తీవ్ర ఇబ్బందులు





పడుతున్న పరిస్థితిని చూసి ఆవేదన వ్యక్తం చేశారు. దాడి ఘటనపై దర్యాప్తు జరిపి బాధ్యులందరినీ అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రజాప్రతినిధులు, అధికారులు అండగా నిలవాలని కోరారు. ఘటనపై ఉన్నతాధికారులు దర్యాప్తు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిందితులందరినీ అరెస్టు చేయకపోతే ఆత్మకూరు పోలీస్‌స్టేషన్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు

# స్థానిక ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సమాయత్తం

## కల్లూరు మండల ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి విస్తృత సమావేశం





**కల్లూరు ప్రతినిధి, సెప్టెంబర్ 20 (రిపబ్లిక్ న్యూస్)**

మాధవినగర్ క్యాంపు కార్యాలయంలో పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి ఆధ్వర్యంలో కల్లూరు మండల పరిధిలోని అన్ని గ్రామాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు, నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకట రెడ్డి, యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాల్సిన అంశాలపై నాయకులతో విస్తృతంగా చర్చించారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, నాయకులుకార్యకర్తల మధ్య సమన్వయంతో ముందుకు సాగడం, ఎన్నికల సన్నద్ధతను పటిష్టం చేయడంపై సమీక్షించారు. అలాగే గ్రామాల వారీగా పార్టీ కార్యకలాపాలు, స్థానిక పరిస్థితులు, ప్రజల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై ముఖ్య నాయకుల అభిప్రాయాలను ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామంలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.

# ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ విజయవంతం






**రాప్తాడు/జయలక్ష్మీపురం, సెప్టెంబర్ 20 (రిపబ్లిక్ న్యూస్):**

క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి, ప్రజల్లో అవగాహన పెంచేందుకు జయలక్ష్మీపురంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ విజయవంతంగా ముగిసింది. పూజ్య శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ, పూజ్య శ్రీ దత్తవిజయానంద తీర్థ స్వామీజీ వారి దివ్య ఆశీస్సులతో కిమ్స్ సవీరా హాస్పిటల్, కిమ్స్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో శ్రీ జయలక్ష్మీ మాత ఉచిత వైద్యశాలలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. జయలక్ష్మీపురంతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు శిబిరానికి హాజరయ్యారు. మొత్తం 105 మందికి పైగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వివిధ రకాల క్యాన్సర్లకు సంబంధించి ప్రాథమిక పరీక్షలతో పాటు వైద్యుల సంప్రదింపులు అందించారు.క్యాన్సర్ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా ముందస్తుగా పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించే అవకాశం ఉంటుందని వైద్యులు అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

శిబిరం విజయవంతానికి సహకరించిన కిమ్స్ సవీరా హాస్పిటల్, కిమ్స్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు, సిబ్బంది, సేవా కార్యకర్తలు, వాలంటీర్లకు ఎస్‌జీఎస్ ఆశ్రమం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. వివిధ గ్రామాల నుంచి ప్రజలను శిబిరానికి తీసుకువచ్చిన వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No.:2023/87888





# సినిమాలకు ఇక కఠిన నిబంధనలు..

## డ్రగ్స్ సీన్లపై తప్పనిసరి హెచ్చరిక!

సినిమాల్లో ఏం చూపించాలనే విషయంలో ఇక మరింత కఠిన నిబంధనలు అమల్లోకి వచ్చాయి. డ్రగ్స్, హింస, లైంగిక హింస, చిన్నారులపై వేధింపుల వంటి సున్నిత అంశాల చిత్రీకరణపై కేంద్రం కొత్త మార్గదర్శకాలు తీసుకొచ్చింది. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ శుక్రవారం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ)కు సంబంధించిన సవరించిన మార్గదర్శకాలను ప్రకటించింది. 1991లో జారీ చేసిన నిబంధనల స్థానంలో ఇవి వచ్చాయి.డ్రగ్స్ తీసుకోవడం లేదా అక్రమంగా తరలించే సన్నివేశాలు ఉంటే ఇక తెరపై తప్పనిసరిగా హెచ్చరిక కనిపించాలి. »»Illicit narcotics destroy health and guarantees imprisonment. Say No To Drugs" అనే సందేశాన్ని ప్రదర్శించాలి. మద్యం, డ్రగ్స్, పొగాకు అలవాట్లను సమర్థించేలా లేదా గొప్పగా చూపించే సన్నివేశాలు సినిమాల్లో ఉండొద్దని నిబంధనలు చెబుతున్నాయి.

హింసను సమర్థించేలా కానీ, గొప్పగా చూపించేలా కానీ సన్నివేశాలు ఉండకూడదు. మహిళలను కించపరిచే సన్నివేశాలు, లైంగిక వేధింపులు, లైంగిక హింసను అవసరానికి మించి చూపించకూడదు. కథకు తప్పనిసరిగా అవసరమైన సందర్భాల్లోనూ ఇలాంటి సన్నివేశాలను సాధ్యమైనంత తక్కువగా ఉంచాలని నిబంధనలు చెబుతున్నాయి.చిన్నారులను హింసకు బాధితులుగా, హింసకు పాల్పడేవారిగా చూపించడాన్ని కూడా నివారించాలని సూచించారు. పిల్లలపై ఎలాంటి వేధింపులనూ చూపించకూడదు. దివ్యాంగులను ఎగతాళి చేసేలా, అవమానించేలా సన్నివేశాలు ఉండకూడదు. జంతువులపై అనవసరమైన హింసను కూడా చూపించొద్దని నిబంధనల్లో స్పష్టం చేశారు.మతాలు, వర్గాలను కించపరిచేలా ఉండే మాటలు, దృశ్యాలపై ఆంక్షలు కొనసాగనున్నాయి. సామాజిక విద్వేషం, మూఢనమ్మకాలు, శాస్త్రవిరుద్ధ భావనలు, దేశ వ్యతిరేక ధోరణులను ప్రోత్సహించే కంటెంట్‌కు కూడా చోటు ఉండదు. కోర్టుల గౌరవాన్ని దెబ్బతీసే సన్నివేశాలపైనా నిబంధనలు ఉన్నాయి.

# ఆ హాలీవుడ్ రీమేక్‌లో ఉచితంగానైనా నటిస్తా : విజయ్ సేతుపతి



విలక్షణ నటనతో దక్షిణ భారతదేశంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 'మక్కల్ సెల్వన్' విజయ్ సేతుపతి తన రాబోయే చిత్రాలు, హాలీవుడ్ రీమేక్ ఆఫర్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల దర్శకుడు నిథిలన్ స్వామినాథన్ తనకు 'మహారాజా 2' కథను వినిపించారని, ఆ కథ వినగానే తనకు ఎంతగానో నచ్చిందని వెల్లడించారు. 'మహారాజా' మొదటి భాగం విడుదల కాకముందు కొందరు అనుమానాలు వ్యక్తం చేసినప్పటికీ, తాను మాత్రం సినిమా విజయంపై గట్టి నమ్మకంతో ఉన్నానని గుర్తుచేసుకున్నారు.

అంతేకాకుండా, 'మహారాజా' సినిమాకు సంబంధించి ఇటీవల హాలీవుడ్ నుంచి ఒక భారీ సర్ ప్రైజ్ వచ్చిందని విజయ్ సేతుపతి తెలిపారు. ఈ సినిమా రీమేక్ హక్కులను హాలీవుడ్ సంస్థ దక్కించుకుందని, అందులో ప్రముఖ హాలీవుడ్ స్టార్ నటుడు మాథ్యూ మెక్‌కొనాహే నటించబోతున్నారని నిర్మాత తనకు ఫోన్ చేసి చెప్పినట్లు వివరించారు. ఈ వార్త విన్నవెంటనే తాను ఎంతో థ్రిల్ అయ్యానని... "ఆ హాలీవుడ్ రీమేక్‌లో నాకు ఒక చిన్న పాత్ర ఇప్పించండి. ఉచితంగా నటిస్తాను" అని నిర్మాతతో సరదాగా అన్నట్లు పంచుకున్నారు. మొదటి నుంచి హాలీవుడ్‌లో నటించాలనే కోరిక ఉందని, తన చిత్రం అక్కడ రీమేక్ కావడం ఎంతో గర్వంగా ఉందని చెప్పారు.



# ఆస్కార్ రేసులో మరాఠీ చిత్రం 'గోంధాల్'..





99వ అకాడమీ అవార్డుల (ఆస్కార్) కోసం భారత్ నుంచి అధికారిక ఎంట్రీగా ఏ చిత్రం వెళ్తుందనే ఉత్కంఠకు తెరపడింది. దేశవ్యాప్తంగా పలు భాషల నుంచి వచ్చిన సినిమాలను పరిశీలించిన ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జ్యూరీ, అనూహ్యంగా మరాఠీ థ్రిల్లర్ చిత్రం 'గోంధాల్'ను ఎంపిక చేసింది. ఈ రేసులో గట్టి పోటీదారుగా నిలిచిన, బాక్సాఫీస్ వద్ద సుమారు రూ.3,000 కోట్లు వసూలు చేసిన రణ్‌వీర్ సింగ్ 'ధురంధర్' ఫ్రాంచైజీకి నిరాశే ఎదురైంది.ఈ ఎంపిక ప్రక్రియలో 14 మంది సభ్యులున్న జ్యూరీలో ఒకరైన వివేక్ వాస్వానీ, 'ఎన్డీటీవీ'తో మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు. 'ధురంధర్' సినిమాను ఎందుకు ఎంపిక చేయలేదనే ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. "కొంతమంది సభ్యులకు ఆ సినిమా నచ్చింది. కానీ, అది ఆస్కార్ స్థాయి సినిమా అని మేము భావించలేదు. మేము ఆశించిన విధంగా అందులో భారతీయ సంస్కృతి ప్రతిబింబించలేదు" అని స్పష్టం చేశారు. 14 మంది జ్యూరీ సభ్యులలో కేవలం నలుగురు మాత్రమే 'ధురంధర్'కు ఓటు వేశారని ఆయన తెలిపారు. మరోవైపు, భారత్ తరఫున ఆస్కార్ బరిలో నిలవనున్న 'గోంధాల్' చిత్రాన్ని సంతోష్ దవాఖర్ రచించి, దర్శకత్వం వహించారు. మహారాష్ట్రలో అర్ధరాత్రి నిర్వహించే 'గోంధాల్' అనే సంప్రదాయ ఆచారాలు, జానపద కళల నేపథ్యంలో ఈ థ్రిల్లర్ రూపుదిద్దుకుంది. చిత్రంలో భారతీయ సంస్కృతిని, సంప్రదాయాలను బలంగా చూపించడం జ్యూరీని ఎంతగానో ఆకట్టుకుంది.

ఈ చిత్రం ఇప్పటికే పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రశంసలు అందుకుంది. 2025లో జరిగిన 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఐఎఫ్ఎఫ్ఐ)లో దర్శకుడు సంతోష్ దవాఖర్ ఉత్తమ దర్శకుడిగా సిల్వర్ పీకాక్ అవార్డును గెలుచుకున్నారు. ఈ చిత్రంలో కిషోర్ కదమ్, ఇషితా దేశ్‌ముఖ్, యోగేష్ సోహోని ప్రధాన పాత్రలు పోషించగా, ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా సంగీతం అందించారు.

ఈ ఏడాది ఆస్కార్ ఎంట్రీ కోసం మొత్తం 33 చిత్రాలు పోటీపడ్డాయి. వీటిలో 14 హిందీ, 4 మరాఠీ, 4 తెలుగు, 3 గుజరాతీ, 3 తమిళ చిత్రాలతో పాటు మలయాళం, నేపాలీ, నాగాలాండ్ నుంచి ఒక్కో సినిమా ఉన్నాయి. చివరి దశలో 'గోంధాల్', 'అంగ్', 'మైనే వాపస్ ఆయుంగా' అనే మూడు చిత్రాలు నిలవగా, తుది ఎంపికలో జ్యూరీ 'గోంధాల్' వైపే మొగ్గు చూపింది.

ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ హీరోగా వచ్చిన 'ధురంధర్' ఫ్రాంచైజీ, 2025 డిసెంబర్, 2026 మార్చిలో రెండు భాగాలుగా విడుదలై ప్రపంచవ్యాప్తంగా భారీ విజయం సాధించింది. అయినప్పటికీ వాణిజ్య విజయాల కన్నా సాంస్కృతిక ప్రాధాన్యతకే జ్యూరీ పెద్దపీట వేయడంతో ఈ ప్రతిష్ఠాత్మక అవకాశం మరాఠీ చిత్రానికి దక్కింది.

# జీవితంపై అమితాబ్ పాఠం..



బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ తన బ్లాగ్ వేదికగా జీవితానికి సంబంధించిన ఒక ముఖ్యమైన పాఠాన్ని పంచుకున్నారు. నిరంతర ప్రయత్నం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, జీవితంలోని సవాళ్లను ఆయన ఒక ఆటోమేటిక్ లిఫ్ట్ డోర్‌తో పోల్చారు. ఆయన వ్యక్తం చేసిన ఈ అభిప్రాయాలు ప్రస్తుతం ఎంతోమందికి స్ఫూర్తినిస్తున్నాయి.ఈ సందర్భంగా ఆయన ఒక ఆసక్తికరమైన విషయాన్ని ప్రస్తావించారు. "కొన్ని పనులు చెప్పకుండానే జరిగిపోతాయి, మరికొన్ని చెబితే జరుగుతాయి, ఇంకొన్ని కాస్త ఒత్తిడి చేస్తే గానీ పూర్తి కావు. అయితే, ఏదో ఒక మార్గంలో పని జరగడం మాత్రం ఖాయం" అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. దీనిని వివరిస్తూ లిఫ్ట్ డోర్ ఉదాహరణను ఆయన వివరించారు. "లిఫ్ట్ ఆటోమేటిక్ డోర్ కొద్దిసేపటి తర్వాత దానంతట అదే మూసుకుపోతుంది. మనం లోపలికి ప్రవేశించడంలో ఆలస్యం చేస్తే, అది మూసుకోబోతుంది. కానీ ఆ సమయంలో ఒక చిన్న వేలు అడ్డుపెట్టినా చాలు, అది తిరిగి తెరుచుకుంటుంది" అని పేర్కొన్నారు.ఈ ఉదాహరణను జీవితానికి అన్వయిస్తూ.. "జీవితంలో కూడా అంతే. ఒక చిన్న ప్రయత్నం సైతం మూసుకుపోయిన తలుపులను తెరుస్తుంది. ఆ ప్రయత్నం ఒక వేలు పెట్టినంత స్వల్పమైనా సరే, ఫలితం ఉంటుంది. ప్రయత్నించకుండా ఏదీ లభించదు! నిరంతరం ప్రయత్నిస్తూనే ఉండండి... ఏదో ఒక రోజు ఆ తలుపు విసిగిపోయి తనంతట తానుగా తెరుచుకుంటుంది" అని అమితాబ్ తన సందేశాన్ని ముగించారు. ఎంత చిన్నదైనా సరే, నిరంతరం చేసే ప్రయత్నం చివరికి మూసుకుపోయిన అవకాశాల తలుపులను సైతం తెరుస్తుందన్నదే ఆయన మాటల సారాంశం.

# ప్రతి సీన్ సర్‌ప్రైజ్ చేస్తుంది...

## 'హతః' చాలా స్పెషల్: కిరణ్ అబ్బవరం



యువ హీరో కిరణ్ అబ్బవరం నటుడిగానే కాకుండా నిర్మాతగానూ ప్రయాణం సాగిస్తుండడం తెలిసిందే. ఆయన తన సొంత నిర్మాణ సంస్థ 'కేఏ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై పౌర్ణమి ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి 'హతః' అనే చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనుష్ గోరక్ దర్శకత్వం వహిస్తున్న ఈ మిస్టికల్ థ్రిల్లర్ మూవీ టీజర్‌ను హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఘనంగా విడుదల చేశారు. నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా, ప్రతి ప్రేక్షకుడిని ఆశ్చర్యపరిచేలా ఉంటుందని కిరణ్ అబ్బవరం ధీమా వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ, ""హతః' మాకు చాలా ప్రత్యేకమైన చిత్రం. ఈ దీపావళికి ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని అందించబోతున్నాం. సినిమా చూస్తున్నంత సేపు తర్వాత ఏం జరుగుతుందనే ఉత్కంఠ ప్రతి సన్నివేశంలోనూ ఉంటుంది. సినిమా పూర్తయ్యాక, అందులోని లింక్ పాయింట్స్ గుర్తుకు తెచ్చుకోవడానికి నాకే పది నిమిషాలు పట్టింది. దర్శకుడిని అడిగి మరీ అన్ని విషయాలు తెలుసుకున్నాను. అంత లోతైన కథ ఇది. నేను నిర్మాతగా ఈ ప్రాజెక్టులోకి మధ్యలో అడుగుపెట్టాను. ప్రాంతీయ బేధాలు లేకుండా అందరూ ఆస్వాదించేలా ఈ సినిమా ఉంటుంది, అందుకే అన్ని భాషల్లోనూ విడుదల చేస్తున్నాం" అని వివరించారు.చిత్ర దర్శకుడు అనుష్ గోరక్ మాట్లాడుతూ, "ఇది ఒక మిస్టికల్ థ్రిల్లర్. హారర్ అంశాలు కూడా ఉంటాయి. కథలో చాలా రహస్యాలు ఉన్నాయి, వాటిని థియేటర్లలో చూస్తేనే ఆ అనుభూతి దక్కుతుంది" అని తెలిపారు. మరో నిర్మాత శివశంకర నాయుడు మాట్లాడుతూ, "ఎలాంటి ప్రాంతీయ హద్దులు లేని అరుదైన సినిమా ఇది. ఏ ప్రాంతం వారు చూసినా తమ కథలాగే అనిపిస్తుంది. సాంకేతికంగా ఉన్నత స్థాయిలో ఉంటుంది" అని అన్నారు.బిగ్ బాస్ షోకి వెళ్లకముందే ఈ చిత్రంలో నటించానని నటి తనూజ పుట్టుస్వామి తెలిపారు. మూడేళ్ల తమ ప్రయాణం గురించి, దర్శకుడి విజన్ గురించి ఆమె వివరించారు. కో-ప్రొడ్యూసర్, నటుడు కుష్ణ మాట్లాడుతూ, విజువల్స్ హాలీవుడ్ స్థాయిలో ఉన్నాయని, అనుష్ లాంటి దర్శకులు టాలీవుడ్‌కు అవసరమని అన్నారు.రెహమాన్, కుష్ణ, తనూజ పుట్టుస్వామి, నమ్రిత కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని కిరణ్ అబ్బవరం సమర్పణలో శివశంకర నాయుడు నిర్మిస్తున్నారు. జేసిన్ జార్జ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నవంబర్ 6న థియేటర్లలో ప్రేక్షకులకు సరికొత్త థ్రిల్‌ను పంచేందుకు సిద్ధమవుతోంది.



# బ్లాక్ డ్రెస్‌లో హీట్ పెంచేసిన మృణాల్ ఠాకూర్..

తెలుగు ప్రేక్షకుల గుండెల్లో సీతారామం'తో చెరగని ముద్ర వేసుకున్న అందాల భామ మృణాల్ ఠాకూర్, తాజాగా పోస్ట్ చేసిన హాట్ పిక్స్‌తో సోషల్ మీడియాలో సెగలు రేపుతోంది. క్లాసీ బ్లాక్ డ్రెస్‌లో తనదైన స్టైల్ మార్క్ చూపిస్తూ ఈ ముద్దుగుమ్మ ఇచ్చిన పోజులు నెటిజన్లను అవాక్కయ్యేలా చేస్తున్నాయి. సింపుల్ అండ్ ఎలిగెంట్ లుక్‌లో దేవకన్యలా మెరిసిపోతున్న మృణాల్ పిక్స్ ప్రస్తుతం ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ అవుతూ ఫ్యాన్స్‌ను తీవ్రంగా ఆకట్టుకుంటున్నాయి.ఈ ప్రత్యేక ఫోటోషూట్ కోసం మృణాల్ ఠాకూర్ 'షాహిన్ మన్నన్' బ్రాండ్‌కు చెందిన ప్యాపీ ఫ్లవర్ బ్లూజ్ అండ్ స్టేట్‌మెంట్ స్కర్ట్ అవుట్‌ఫిట్‌ను ఎంచుకుంది. ఇక ఫుల్ స్లీవ్స్ క్రాప్డ్ బ్లూజ్, దానికి తగ్గట్టుగా ఉన్న హై-వెస్ట్ ఫుల్లీ ఫ్లేర్డ్ స్కర్ట్‌పై కింద భాగంలో ఎరుపు రంగు పూల ఎంబ్రాయిడరీ వర్క్ ఆమె లుక్‌కు గ్రాండ్ అప్పీల్‌ను తెచ్చిపెట్టింది. నడుము వద్ద సన్నని బెల్ట్, డోప్ కట్స్‌తో మృణాల్ ఎంతో రాయల్‌గా మెరిసిపోయింది నెట్టింట లైకుల వర్షం: ఈ అద్భుతమైన పిక్స్ సోషల్ మీడియాలో పోస్ట్ చేయగానే ఫ్యాన్స్ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. "బ్రీత్‌టేకింగ్ ప్రిన్సెస్", "అబ్సల్యూట్లీ స్టన్నింగ్ అండ్ గార్జియస్", "బ్లాక్ కలర్‌లో నీ అందం వేరే లెవెల్" అంటూ నెటిజన్లు పొగడ్తలతో నింపేస్తున్నారు. వెలుతురులో చిరునవ్వుతో ఉన్న మృణాల్ పిక్స్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచాయి. బుల్లితెర నుంచి స్టార్ హీరోయిన్ వరకు : మహారాష్ట్రకు చెందిన మృణాల్ ఠాకూర్, 'కుంకుమ భాగ్య' సీరియల్‌తో మంచి పాపులారిటీ సాధించి, 'లవ్ సోనియా' చిత్రంతో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. 'సూపర్ 30', 'బాట్లా హౌస్' చిత్రాల్లో నటిగా మెప్పించిన ఈ భామ, 'సీతారామం'తో పాన్ ఇండియా లెవెల్లో భారీ క్రేజ్ సంపాదించుకుంది. ఇక ఆ తర్వాత 'హాయ్ నాన్న', 'జర్సీ', 'ది ఫ్యామిలీ స్టార్' వంటి చిత్రాలతో వరుస విజయాలు అందుకుంది.! ఇక రీసెంట్ గా సిద్ధాంత్ చతుర్వేదితో కలిసి 'దో దివానే షెహర్ మే', అడివి శేష్ సరసన బైలింగువల్ డ్రామా 'డెకాయిట్: ఏ లవ్ స్టోరీ', వరుణ్ ధావన్‌తో కలిసి 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' చిత్రాల్లో నటించి మంచి సక్సెస్ అందుకుంది..ఇక తన అద్భుతమైన ఫ్యాషన్ సెన్స్‌తో పాటు విభిన్నమైన పాత్రలతో ఆకట్టుకుంటున్న మృణాల్ ఠాకూర్, రాబోయే రోజుల్లో అన్ని భాషల్లోనూ మరిన్ని భారీ విజయాలు సాధించాలని అభిమానులు కోరుకుంటున్నారు.



# రాయికల్ లో పర్యావరణ గణపతితో ఆదర్శంగా మనయూత్ 12 ఏళ్లుగా మట్టి విగ్రహాల ప్రతిష్ట..

**ఈసారి చెట్ల సంరక్షణకు వినూత్న సందేశం**

**“ చెట్లను నాటుదాం.. ప్రకృతిని రక్షిద్దాం “ అనే సందేశంతో గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహణ**

**-డాక్టర్ సద్దుల సంతోష్**







**రాయికల్ మండలం సెప్టెంబర్,20( రిపబ్లిక్ న్యూస్)**

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం లోని గత 12 సంవత్సరాలుగా మట్టి గణపతులను ప్రతిష్టిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న మన యూత్ సభ్యులు ఈ ఏడాది మరింత వినూత్నంగా పర్యావరణ గణపతిని ప్రతిష్టించారు, “ చెట్లను నాటుదాం.. ప్రకృతిని రక్షిద్దాం “ అనే సందేశంతో గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు, పర్యావరణ పరిరక్షణ పై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు సహజ వనరుల పరిరక్షణ అవశ్యకతను చాటి చెప్పేలా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు సద్దుల సంతోష్ తెలిపారు, గత 12 సంవత్సరాలుగా వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతులను ప్రతిష్టిస్తూ పర్యావరణహిత ఉత్సవాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు, రసాయనాలు, ప్లాస్టిక్ అప్ పరుస్తూ తయారుచేసిన విగ్రహాల వల్ల నీటి వనరులకు కలిగే నష్టాన్ని తగ్గించేందుకు మట్టి విగ్రహాలని ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు



ఈ కార్యక్రమంలో ఈ ఏడాది పర్యావరణ గణపతిని ఏర్పాటు చేసి ప్రజలకు పర్యావరణ పరిరక్షణ పై ప్రత్యేక సందేశాన్ని అందిస్తున్నామని చెప్పారు, మొక్కలు నాటడం మాత్రమే, సంరక్షణ కూడా ముఖ్యం ప్రస్తుతం పర్యావరణ సమతుల్యత దెబ్బతింటున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు కావలసిన అవసరం ఉందని సద్దుల సంతోష్ అన్నారు, మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తొలి అడుగు వేయాలని వాటిని ప్రతి మొక్కను బాధ్యతగా సామ్రాక్షించి పెద్ద చెట్టుగా పెంచాలని సూచించారు, చెట్లు పెరిగితే స్వచ్ఛమైన గాలి సమృద్ధిగా వర్షాలు ఆరోగ్యమైన జీవనం సాధ్యమవుతుందని తెలిపారు, యువత చొరవ అభినందనీయం గణపతి నవరాత్రి ఉత్సవాలను కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం చేయకుండా సామాజిక పర్యావరణ సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉద్దేశంతో కార్యక్రమాలు చేపడుతున్నామని నిర్వాహకులు డాక్టర్ సంతోష్ తెలిపారు, యువత ముందుకు వచ్చి పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు, వినాయక ఉత్సవాల్లో భాగంగా పర్యావరణహిత విధానాలను పాటిస్తూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ప్రకృతికి హాని కలగకుండా వేడుకలను నిర్వహించాలని కోరారు, “ వినాయకుడి ఆశీస్సులతో ప్రకృతిని కాపాడే బాధ్యతను కూడా తీసుకోవాలి ప్రతి ఇంటి పరిసరాల్లో ఒక్క మొక్కను నాటి దానిని సంరక్షించాలి పర్యావరణ పరిరక్షణలో యువత ముందుండాలి “ అని సద్దుల సంతోష్ పేర్కొన్నారు, మా యూత్ చేపట్టిన ఈ పర్యావరణహిత కార్యక్రమం స్థానికంగా ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

# రాయికల్ లో గణపతుల నిమజ్జనం పెద్ద చెరువులో చేయాలి భక్తుల విన్నపం

**-పట్టణములో గణపతులను 23,24,25 తేదీలలో నిమజ్జనకు పూర్తి ఏర్పాట్లు చేశామని మునిసిపాల్ చైర్మన్ కటకం రవీందర్**



**రాయికల్ మండలం సెప్టెంబర్ 20( రిపబ్లిక్ న్యూస్)**

రాయికల్ పట్టణ గణపతుల నిమజ్జనం నీళ్లు లేని కాడ గణపతులను నిమజ్జనం చేయడం సరికాదని మైతాపూర్ రోడ్డంపై నీళ్లు లేక విల విలాడుతున్న గణపతులు అని అది పట్టింపు లేని పాలకవర్గమని గణపతుల నిమజ్జనం అని విద్యావేత్తలు అంటున్నారు నేరుగా పెద్ద చెరువులోకి నిమజ్జనం చేయాలని భక్తులు కోరుతున్నారు హిందువుల మనోభావాలు దెబ్బ తీస్తున్నారని ఇది సరైన మార్గం కాదని భక్తులు హిందు వాదులు అన్న పట్టించుకోవడం లేదని పలువూరు హిందూ భక్తులు ఆరోపిస్తున్నారు

ఇప్పటికైనా పెద్ద చెరువులో గణపతి నిమజ్జనం చేయాలని పలువురు హిందూ వాదులు అంటున్నారు

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణం లో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భక్తి భావంతో ఉత్సాహంతో ఈనెల 23, 24, 25 తేదీలలో ముగించాలని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా దీనికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని రాయికల్ మున్సిపల్ చైర్మన్ కటకం రవీందర్ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాయికల్ పట్టణంలో గణేష్ నిమజ్జన ఉత్సవాలు ఈనెల 23,24, 25 తేదీలలో నిర్వహించడం జరుగుతున్నాయని దీనికి రాయికల్ మున్సిపల్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రజలకు యువజన సంఘాల సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేయడం జరుగుతుందని అలాగే భారీ గణపతులకు నిమజ్జనం చేయడానికి క్రెన్ సౌకర్యం కల్పించడం జరిగిందని రవీందర్ తెలిపారు

# కుమ్మరి పిల్లి పద్మశాలి సేవా సంఘం ద్వారా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువాల తో సత్కారం







**రాయికల్ మండలం సెప్టెంబర్20( రిపబ్లిక్ న్యూస్)**

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కుమ్మరి పెల్లి పద్మశాలి సేవా సంఘం లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన గాజెంగి రాజేశం. మమత దంపతులకు సంఘంలో సన్మానం జరిగింది ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పారిపెల్లి నారాయణ, ఉడుత నందయ్య, సామల్ల బుచ్చన్న, శ్రీనివాస్ .సత్యనారాయణ.అంజయ్య రాంప్రసాద్ .మల్లేశం రవీందర్. మురళి. మహేష్ సంఘ సభ్యులు ప్రజలు పాల్గొన్నారు

# ఈనెల 27న రాయికల్ లో గల శ్రీ చెన్నకేశవనాద ఆలయంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం జరుపుథమని తెలిపిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్





**రాయికల్ మండలం సెప్టెంబర్, 20( రిపబ్లిక్ న్యూస్)**

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 27న జగిత్యాల జిల్లా రాయికల్ మండల కేంద్రంలో శ్రీ చెన్నకేశవ నాద ఆలయం లో వేడుకలను ఘనంగా నిర్వహించనున్నాట్లు జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామా అని తెలిపారు పర్యాటక రంగం ప్రాధాన్యత ఆర్థిక అభివృద్ధి ఉపాధి కల్పన సాంస్కృతిక మార్పిడి సుస్థిర అభివృద్ధి పర్యాటక అభివృద్ధిలో పర్యాటక రంగం పోషించే కీలక పాత్ర పై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ పర్యాటక దినోత్సవ ప్రధాన ఉద్దేశం అని పేర్కొన్నారు 2026 సంవత్సరానికి డిజిటల్ అజెండా మరియు కృతిమ మేధస్సుతో పర్యటక రంగం పునర్ రూపకల్పన అనే తిమును నిర్వహించినట్లు తెలిపారు ఈ నేపాధ్యంలో జిల్లాలోని పర్యాటక ప్రదేశాల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేస్తూ పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే విధంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నాట్లు పేర్కొన్నారు ప్రపంచ పర్యాటక దినోత్సవ నిర్వహణపై ఈనెల తొమ్మిదిన రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించిన పర్చువల్ సమావేశంలో తాను పాల్గొన్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపరు ఈ సందర్భంగా జగిత్యాల జిల్లాలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను రాయికల్లోని శ్రీ చెన్నకేశవనాద ఆలయంలో నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు జిల్లాలోని చరిత్రత ఆధ్యాత్మిక సాంస్కృతిక పర్యాటక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల విశిష్టతను ప్రజలకు తెలియజేస్తూ పర్యటకారంగా అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించాలి




# జోగిపేట 10వ వార్డులో ఘనంగా గణపతి కళ్యాణం

**రాఘవసేన యూత్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా గణపతి కళ్యాణోత్సవం**







**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 20 (రిపబ్లిక్ న్యూస్)**ఆందోల్.జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో రాఘవసేన యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద గణపతి కళ్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు.నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి అందోల్-జోగిపేట మున్సిపాలిటీ కౌన్సిలర్ పట్లోల్ల రేఖ ప్రవీణ్ దంపతులు హాజరై గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని గణపతిని భక్తిపూర్వకంగా ప్రార్థించారు.వేదమంత్రాల నడుమ గణపతి కళ్యాణం నిర్వహించడంతో మండపం వద్ద ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కౌన్సిలర్ పట్లోల్ల రేఖ ప్రవీణ్ దంపతులతో పాటు కొడిపాక సందీప్ దంపతులు కూడా గణపతి కళ్యాణంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాఘవసేన యూత్ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కార్యక్రమాన్ని నిర్వహించారు

# హత్నూరలో బీసీ, ఎస్టీ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

**విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన వసతులు అందించాలి**

**సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్‌కు ఫోన్ ద్వారా ఆదేశం**









**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 20 (రిపబ్లిక్ న్యూస్)**

విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన భోజనం అందించడంలో ఎలాంటి అలసత్వాన్ని ఉపేక్షించేది లేదని నర్సాపూర్ ఎమ్మెల్యే శ్రీమతి సునీతా లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం హత్నూర మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహం మరియు ఎస్టీ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వసతి గృహాల్లోని వంటశాల, నిల్వ ఉంచిన నిత్యావసర సరుకులు, తాగునీరు, మరుగుదొడ్లు మరియు పరిసరాల పరిశుభ్రతను ఎమ్మెల్యే క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా ముచ్చటించి, వారికి అందుతున్న భోజనం నాణ్యత, వసతి సౌకర్యాలు మరియు వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని వసతి గృహాల అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.అనంతరం అక్కడి నుంచే సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వెంటనే తగిన పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు. విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యం మరియు విద్యా ప్రగతికి తమ వంతు ప్రాధాన్యతనిస్తామని, వసతి గృహాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తామని ఆమె పేర్కొన్నారు.

# డిజెఎఫ్ మహాసభలకు మాజీ ఎమ్మెల్యే కుర్ర సత్యనారాయణకు ఆహ్వానం

**అక్టోబర్ 7న సంగారెడ్డిలో 11వ రాష్ట్ర మహాసభలు -డిజెఎఫ్ కృషిని అభినందించిన మాజీ ఎమ్మెల్యే**



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి**
**సెప్టెంబర్ 20 (రిపబ్లిక్ న్యూస్)**

అక్టోబర్ 7న సంగారెడ్డిలో నిర్వహించనున్న దళిత జర్నలిస్టుల ఫోరం (డిజెఎఫ్) 11వ రాష్ట్ర మహాసభలకు హాజరు కావాలని మాజీ ఎమ్మెల్యే కుర్ర సత్యనారాయణను డిజెఎఫ్ నాయకులు ఆహ్వానించారు. ఆదివారం పటాన్‌చెరులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన డిజెఎఫ్ నాయకులు మహాసభల కరపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కుర్ర సత్యనారాయణ మాట్లాడుతూ, దళిత జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం డిజెఎఫ్ నాయకులు చేస్తున్న కృషిని అభినందించారు. అక్టోబర్ 7న సంగారెడ్డిలో నిర్వహించనున్న డిజెఎఫ్ రాష్ట్ర మహాసభలకు హాజరవుతానని తెలిపారు.

ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తున్న దళిత జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయడం అభినందనీయమన్నారు. దళితుల జీవితాల్లో విద్య కీలకమైన మార్పును తీసుకురాగలదని పేర్కొంటూ, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా కృషి చేయాలని డిజెఎఫ్ నాయకులకు సూచించారు. విద్య ద్వారా సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు

ఈ కార్యక్రమంలో డిజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తలారి యాదగిరి, ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు రాపాక విజయ్ రాజు, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రామని అశోక్, జిల్లా కార్యదర్శి ముక్కగల్ల యాదన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888



# కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

**- మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి**

**వైసిపి విస్తృత స్థాయి సమావేశానికి భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు**



**బండి ఆత్మకూరు, సెప్టెంబర్ 20,( రిపబ్లిక్ న్యూస్):-**
త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కార్యకర్తలు సైనికుల్ల పనిచేయాలని శ్రీశైలం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని పార్నపల్లి టిటిడి కళ్యాణ మండపంలో వైయస్సార్సీపి మండల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వైసీపీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా చక్రపాణి రెడ్డి, ఆయన సోదరుడు నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డిలు పార్టీ శ్రేణులకు స్థానిక సంస్థల ఎన్నికలపై దిశా నిర్దేశం చేశారు. ఉన్న ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం, పార్టీనీ గ్రామస్థాయిలో మరింత పటిష్టం చేసేందుకు వైసిపి అధిష్టానం ఒక్కో గ్రామానికి సుమారు 70 మంది నుంచి 90 మంది దాకా పార్టీ కార్యకర్తలను వివిధ హోదాల్లో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీరందరికీ వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. పార్టీ శ్రేణులు ఎవరు ఎలాంటి భేషజాలకు పోకుండా అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. అప్పుడే విజయం దక్కుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అధిష్టానం అభ్యర్థిగా ఎవరిని నియమించిన అందరూ కలిసికట్టుగా పనిచేసి ఆ అభ్యర్థి గెలుపు కోసం పనిచేయాలనీ సూచించారు. కూటమి ప్రభుత్వం ఆగడాలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలన్నారు.సూపర్ సిక్స్ పథకాలు ఏ ఒక్కటి అమలు చేయలేదని చక్రపాణి రెడ్డి దుయ్యబట్టారు. ఎక్కడ చూసినా ఎమ్మెల్యేలు మట్టి మాఫియా, ఇసుక మాఫియాతో పేట్రేగిపోతున్నారని ఆయన మండిపడ్డారు. మహిళల పరిస్థితి ఇంకా దారుణంగా ఉందన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో సున్నా వడ్డీకే డ్వాక్రా మహిళలకు రుణాలు వచ్చేవని ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవన్నారు. రైతులు యూరియా కోసం నీళ్ల కోసం రోడ్లెక్కి నిరసన చేపట్టాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందని మాజీ ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు పోలీసులను అడ్డుపెట్టుకొని గ్రామాల్లో భయభ్రాంతులను సృష్టించి స్థానిక సంస్థలు ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు అడ్డగోలు ప్రయత్నాలు చేస్తారన్నారు. పోలీసులు సైతం మన నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి భయభ్రాంతులకు గురిచేస్తారన్నారు. ఇలాంటి వాటికి ఎవరు భయపడాల్సిన అవసరం లేదన్నారు. తాను మీకు అండగా ఉన్నానని అవసరమైతే పోలీసులపై కూడా ప్రైవేట్ కేసులు వేస్తానని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఎల్ నినో సాకుగా చూపి రైతులకు సాగునీరు అందించలేని దౌర్భాగ్య స్థితిలో ఉందన్నారు. ప్రస్తుతం రైతులు సాగు చేసిన పంటలు కాపాడేందుకు మరోసారి పోరాటానికి చేయడానికి రైతులు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. బండి ఆత్మకూరులో ఇటీవల నిర్వహించిన డ్యాముల ముట్టడి కార్యక్రమం ఢిల్లీలో జరిగిన పంజాబ్ రైతుల ఉద్యమం తరహాలో జరిగిందని వీటిని కూటమి ప్రభుత్వం గుర్తించుకోవాలన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కు సాగునీరు అందించకుండా ఆపితే జంజీ తరహాలో మరో ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు సాగునీరు అందించాలని అప్పుడు చేపట్టిన నిరసనలో భాగంగా ఆయన ప్రసంగాన్ని చక్రపాణి రెడ్డి పార్టీ శ్రేణులకు వినిపించారు. ఆనాడు తనకు నీటి విడుదల గురించి ఏమీ తెలియదని మాట్లాడడం జరిగిందన్నారు. కానీ ఆయన చెప్పిన మాటల ప్రకారం 600 క్యూసెక్కుల నీరు ఈర్ణ పాడు వరకు కూడా పారవన్నారు. సుమారు 2000 క్యూసెక్కుల నీరు అయితే మసీదుపురం వరకు రైతులకు సాగునీరుగా ఉపయోగపడతాయన్నారు. ప్రస్తుతం వెలుగోడు రిజర్వాయర్ లో 12 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. వీటిలో ఆరు టిఎంసిల నీరు త్రాగినీటిగా వినియోగించుకోవాలన్నారు.మరో ఆరు టీఎంసీల నీరు ప్రస్తుతం రైతులు సాగుచేసిన పంటలు, త్వరలో వేసుకోనున్న ఆరుతడి పంటలను కాపాడాలన్నారు. అనంతరం పార్టీ శ్రేణులకు ఐడి కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల ఇన్చార్జి బారెడ్డి భాస్కర్ రెడ్డి, ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ దేషు వెంకట రామిరెడ్డి, వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు రాజంరెడ్డి సుజాతమ్మ, చిన్న సుబ్బారెడ్డి, డాక్టర్ శశికళ, కృష్ణ మల్లారెడ్డి,జనార్దన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, జగన్మోహన్ రెడ్డి, బలరామిరెడ్డి, రాగాల బాబుల్, వివిధ గ్రామాల వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# సేవే సంకల్పం

**వెల్ఫేర్ కమ్యూనిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు అజ్జు**

**నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యం**

**త్వరలో జాబ్‌మేళా : వ్యవస్థాపక అధ్యక్షుడు అజ్జు**





**అనంతపురం ప్రతినిధి, సెప్టెంబర్ 20,(రిపబ్లిక్ న్యూస్):**
సేవే సంకల్పంగా ముందుకు సాగుతామని ఆల్ ఇమాన్ ముస్లిం వెల్ఫేర్ కమ్యూనిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు అజ్జు పేర్కొన్నారు.చదువుకోవాలనే ఆసక్తి ఉన్నా ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు అండగా నిలవడం.. చదువు పూర్తిచేసి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు అవకాశాలు కల్పించడం.. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చేయూతనివ్వడం. హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించడం. సేవలు లక్ష్యంగా ఆల్ ఇమాన్ ముస్లిం వెల్ఫేర్ కమ్యూనిటీ ముందుకు సాగుతోంది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ అజ్జు ఆధ్వర్యంలో గుత్తి రోడ్డులోని బీవీకేఆర్ ఫంక్షన్‌హాల్‌లో వెల్ఫేర్ కమ్యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సమాచార చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాయల్ కొండయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు పద్మజ, ఇమామ్ సాహెబ్ జబ్బార్ ఆఫీసాబ్, నిజాముద్దీన్ మౌలానా జబ్బార్ ఆఫీసాబ్, బాబా మౌలానా, సైఫ్ ఉద్దీన్ మౌలానా తదితరులు హాజరయ్యారు.

**హక్కులు తెలుసుకుంటేనే సమస్యలకు పరిష్కారం**
ఆర్థికంగా వెనుకబడిన వారికి సహాయం చేయడంతో పాటు వారి హక్కుల కోసం నిలబడటమే కమ్యూనిటీ ఉద్దేశమని కార్యక్రమంలో పాల్గొన్న వారు తెలిపారు. సమాజంలో ఎదిగే క్రమంలో అనేక సవాళ్లు ఎదురవుతాయని, వాటిని అధిగమించి ముందుకు సాగాలని సూచించారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, ముఖ్యంగా సమాచార హక్కు చట్టం, రాజ్యాంగబద్ధమైన హక్కులు, చట్టపరమైన అంశాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు.మంచి పని చేయడానికి వందమంది వచ్చే వరకు ఎదురుచూడాల్సిన అవసరం లేదని, ఒక్క వ్యక్తి ముందడుగు వేసినా సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టవచ్చని తెలిపారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు.

**విజయవంతం చేయడంలో భాగస్వామ్యం కీలకం**
రాయల్ పుల్లయ్య మాట్లాడుతూ సేవా కార్యక్రమాల నిర్వహణలో షేక్ అజ్జుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సమాజం కోసం నిస్వార్థంగా పనిచేసే సంస్థలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

**సేవా విస్తరణకు సమష్టి భాగస్వామ్యం..**
కమ్యూనిటీ తరఫున చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయడంలో సభ్యులందరి భాగస్వామ్యం కీలకమని షేక్ అజ్జు అన్నారు. ఎలాంటి స్వార్థ ప్రయోజనాలు లేకుండా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. విద్య, ఉపాధి, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు సహాయం తదితర రంగాల్లో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

**విద్యాభ్యాసం కోసం ఆర్థిక సహాయం అందిస్తాం**
ఈ సందర్భంగా అజ్జు మాట్లాడుతూ గత మూడేళ్లుగా వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు పరిమిత స్థాయిలో కొనసాగించిన సేవలను ఇకపై మరింత విస్తృతం చేయనున్నట్లు చెప్పారు. కమ్యూనిటీ కార్యక్రమాలు ప్రతి ఒక్కరికీ చేరువ కావాలనే ఉద్దేశంతో కార్యక్రమాలను విస్తరిస్తున్నామని, సభ్యులు, ప్రజల సహకారంతో సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్ చదువుతున్న ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు విద్యాభ్యాసం కోసం సంస్థ తరఫున ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. డబ్బుల కారణంగా విద్య ఆగిపోకూడదనే ఉద్దేశంతో అర్హులైన విద్యార్థులకు తమవంతు సహకారం అందిస్తామన్నారు.చదువు పూర్తిచేసినా ఉద్యోగాలు లభించక ఇబ్బందులు పడుతున్న యువత కోసం త్వరలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు యువత తమ కాళ్లపై తాము నిలబడేలా ప్రోత్సహించడమే లక్ష్యమన్నారు. అనంతరం ముఖ్య అతిథులకు శాలువాలతో సత్కరించి మెమెంటోళను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, వివిధ సంఘాల నాయకులు, కమ్యూనిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## లోకేశ్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

**రాప్తాడు సంక్షేమం, సెప్టెంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ రేపు రాప్తాడు మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. ఆదివారం టీడీపీ నాయకులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించి అవసరమైన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు.
శ్రీ సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు. మంత్రి పర్యటనకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, పార్కింగ్, రవాణా, పోలీసు బందోబస్తు తదితర అంశాలపై దృష్టి సారించాలని సూచించారు.సభా ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లు, హెలిప్యాడ్ వద్ద తీసుకోవాల్సిన చర్యలు, వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా ట్రాఫిక్ నిర్వహణపై అధికారులు, నాయకులతో చర్చించారు. మంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



# నాదెండ్ల సందేశం....

## జనసేనకు ఎన్ని సీట్లు ?



జనసేన ఈసారి అంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి భారీగానే ఆశలు పెట్టుకుంది. మరీ ముఖ్యంగా గ్రౌండ్ లెవెల్ లో ఉన్నద్వితీయ తృతీయ శ్రేణి నాయకులు, అలాగే క్యాడర్ కూడా ఎక్కువ సీట్లు పోటీ చేయాలని చూస్తున్నారు. దాని వల్ల తమకు అవకాశాలు వస్తాయని పదేళ్లకి పైగా పార్టీ కోసం పడిన కష్టానికి తగిన ఫలితం దక్కుతుందని కూడా భావిస్తున్నారు. ఇక గత కొంతకాలంగా జనసేనలో ఉన్న అభిప్రాయాలు వారి ఆలోచనలకు తగిన విధంగా అధినాయకత్వం కూడా రియాక్ట్ అయింది. జనసేన 2024 ఫార్ములాతో కాదని 2026 కి వచ్చేసరికి బలం పెరిగింది కాబట్టి ఎక్కువ సీట్లు దక్కాలని కూడా నేతల నుంచి డిమాండ్ వచ్చింది. దానికి తగినట్లుగానె 30 శాతం ఫార్ములా అన్నది ఇపుడు ప్రచారంలో ఉంది.
జనసేన పెద్దలు ఈ మధ్య దాకా చెప్పినట్లుగా 30 శాతం సీట్ల సర్దుబాటు కనుక అమలు అయితే ఏపీలో ఉన్న 17 కార్పోరేషన్లలో అయిదారు మేయర్ పీఠాలు దక్కాలి. అలాగే ఎనభై కి పైగా ఉన్న మునిసిపాలిటీలు నగర పాలికలలో 30 దాకా లభించాయి. ఇక 28 దాకా ఉన్న జెడ్పీ పీఠాలలో తొమ్మిది దాకా లభించాలి. రెండు వందల జడ్పీటీసీలు, వేలాదిగా ఉన్న ఎంపీటీసీలు కూడా పొత్తు వాటాలో దక్కాలి. మరి ఈ విధంగానే ఆశలు పెంచుకుని జనసేన నేతలు దిగువ స్థాయిలో పని చేసుకుని పోతున్నాయి. అయితే జనసేనలో నంబర్ టూ అయిన మంత్రి నాదెండ్ల మనోహర్ అయితే తాపీగా చెప్పాల్సింది చెబుతున్నారు. అదేంటి అంటే ఎక్కువగా అంచనాలు పెంచుకోవద్దు అని. దాంతోనే ఇపుడు జనసేన నేతలలో కొత్త రకం ఆందోళన పెరిగిపోతోంది అని అంటున్నారు. విశాఖలో తాజాగా జరిగిన పార్టీ ఆత్మీయ సమావేశంలో జనసేన నంబర్ టూ నేత అయిన నాదెండ్ల మనోహర్ చేసిన వ్యాఖ్యలు అయితే ఆ పార్టీలో రాజకీయ కలకలం రేపుతున్నాయి. ఆయన అన్నది చూస్తే జనసేనకి 60-70 సీట్లని ఎక్స్పెక్ట్ చేయడం మంచిది కాదు అని. అనే కాదు పదవి అధికారంతో పాటు పార్టీకి బాధ్యత కూడా ఉంది అని అన్నారు. , మనం గెలిచే సీట్లు తప్పకుండా తీసుకుందామని మరో మాట అన్నారు. ఇక ఆయన చెప్పినది చూస్తే కూర్చొన్న కొమ్మను నరుక్కోవద్దు అన్న సందేశం కూడా ఉంది. జనసేనాని పవన్ కళ్యాణ్ ఆలోచనలను సైనికులే అర్థం చేసుకోకపోతే ఎలా అని కూడా నాదెండ్ల ప్రశ్నించారు.
అదే మీటింగులో నాదెండ్ల మరిన్ని వ్యాఖ్యలు చేశారని అంటున్నారు. సంస్థాగతంగా జనసేన ఇంకా బలపడాల్సి ఉందని ఆయన చెప్పారు అని చెబుతున్నారు. ఒక పార్టీగా జనసేన నెమ్మదిగా ఎదగాల్సి ఉందని కూడా సూచించారు. ఏతా వాతా నాదెండ్ల మనోహర్ చెప్పేది ఏంటి అంటే బలం ఉన్న చోటనే పోటీ అని. మరి ఆ బలం ఎంత ఉంది ఏమిటి అన్నది ఎవరు తేలుస్తారు అన్నదే ఇపుడు జనసైనికులకు కలుగుతున్న కీలక ప్రశ్న. జనసేన బలం ఇంతే అని ఇచ్చినన్ని సీట్లు తీసుకుంటే ఇంక మనం ఎప్పటికి ఎదిగేది అని జనసైనికులు అయితే మండిపడుతున్నారు. ఏ పార్టీ అయినా కొత్తగా స్థానాలలో పోటీ చేస్తే కదా బలం ఎంత ఉంది అన్నది తెలిసేది అని ప్రశ్నిస్తున్నారు.
జనసేనకు ఏపీ అంతా అవసరం లేదు కేవలం కృష్ణా,ఈస్ట్, వెస్ట్, వైజాగ్ ఇలా చూస్తే నాలుగు జిల్లాల్లో టీడీపీ-జనసేన బలం 60-40 గా ఉంటునని కూడా జనసైనికులు సూచిస్తున్నారు. కాబట్టి ఈ నాలుగు జిల్లాల్లో అయినా 60-40 పద్ధతిలో సీట్లు పంచటం న్యాయం అని వాదిస్తున్నారు. ఇక్కడ చూస్తే మేయర్ జెడ్పీ పీఠాలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. వీటితో పాటు మునిసిపాలిటీలలో కూడా జనసేనకు న్యాయమైన వాటా ఇవ్వాలని కోరుతున్నారు. మొత్తానికి నాదెండ్ల అయితే చెప్పాల్సింది చెప్పారు అంటే జనసేనకు ఎన్ని సీట్లు దక్కుతాయన్న గుబులు అయితే పార్టీ వర్గాలలో ఉంది. తొందరలోనే చంద్రబాబు పవన్ బీజేపీ నేతలు సీట్ల సర్దుబాటు మీద కూర్చో బోతున్నారు అని అంటున్నారు. జనసేనకు నిజంగా 30 శాతం ఫార్ములా ప్రకారం సీట్లు వస్తాయా లేక నాదెండ్ల చెప్పినట్లుగా బలం ఉన్న చోట్ల సీట్లు దక్కుతాయా అన్నది చూడాల్సి ఉంది అని అంటున్నారు.

# గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు స్పెషల్ గ్రేడ్ పోస్ట్ స్కేల్

**ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి ఈ ప్రయోజనం వర్తింపు**

**రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.30 లక్షల మంది సిబ్బందికి లబ్ధి**

**11వ పీఆర్సీ సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ**

**ఇది ప్రమోషన్ కాదు, ఆర్థిక ప్రయోజనం మాత్రమేనని స్పష్టీకరణ**






ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఆరేళ్ల సర్వీసును పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (ూూూ) కింద స్పెషల్ గ్రేడ్ పోస్ట్ స్కేల్ (గ్రా) మంజూరు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆర్థిక శాఖ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా 15,000కు పైగా ఉన్న స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న సుమారు 1.30 లక్షల మంది ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు. ముఖ్యంగా 2019, 2020 సంవత్సరాల్లో తొలి విడతలో నియమితులైన ఉద్యోగులకు ఈ స్కేల్ ప్రయోజనం చేకూరనుంది. 11వ వేతన సవరణ కమిషన్ (గ్ర=జ) చేసిన సిఫార్సులను అనుసరించి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని అమలు చేస్తోంది.అయితే, ఇది రెగ్యులర్ పదోన్నతి కాదని, కేవలం ఆర్థిక ప్రయోజనం మాత్రమేనని అధికారులు స్పష్టం చేశారు. ఒకే పోస్టులో ఎక్కువ కాలం పనిచేస్తున్న ఉద్యోగులకు ఆర్థికంగా భరోసా కల్పించేందుకు ఉద్దేశించిన ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్‌లో భాగంగానే ఈ స్పెషల్ గ్రేడ్ స్కేల్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. ఏఏఎస్ నిబంధనల ప్రకారం, ఉద్యోగులకు 6 ఏళ్ల సర్వీసుకు స్పెషల్ గ్రేడ్, ఆ తర్వాత 12, 18, 24 ఏళ్ల సర్వీసుకు తదుపరి ఆర్థిక ప్రయోజనాలు లభిస్తాయి.తాజా ఉత్తర్వుల నేపథ్యంలో, అర్హులైన ఉద్యోగుల సర్వీస్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, వారికి స్పెషల్ గ్రేడ్ పోస్ట్ స్కేల్‌ను వెంటనే మంజూరు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ నిర్ణయంపై సచివాలయ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi [illegible] a Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com